ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
3★★★ జిల్లా వార్తలు
గురువారం 10 ఏప్రిల్ 2025



సన్నబియ్యం పథకం ఆదర్శం : కలెక్టర్



పారిశుధ్య కార్మికురాలి ఇంట్లో భోజనం చేస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

ఇల్లంతకుంట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): నిరుపేద ప్రజల ఆకలి తీర్చుతున్న సన్నబియ్యం పథకం ఆదర్శంగా నిలుస్తుందని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝాలు పేర్కొన్నారు. మండలకేంద్రంలో పారిశుధ్య కార్మికురాలు మల్లమారి భార్గవి ఇంట్లో సన్నబియ్యంతో వండిన భోజనాన్ని చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతు గతంలో పంపిణీ చేసిన దొడ్డు బియ్యాన్ని ప్రజలు వినియోగించే వారు కారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పేద ప్రజల సమస్యలు తెలిసిన వ్యక్తి కాబట్టే సన్నబియ్యం పథకాన్ని అమలు చేస్తున్నాడని పేర్కొన్నారు. అన్ని రేషన్ దుకాణాలలో సన్న బియ్యం పంపిణీ జరుగుతుందన్నారు. ఎక్కడైన అవంతరాలు ఏర్పడితే అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో డీఆర్డీఓ శేషాద్రి, తహసీల్దార్ ఫారూఖ్, ఎంపీడీఓ శశికళ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ అయిలయ్య, నాయకులు పాశం రాజేందర్‌రెడ్డి, ఆనందరెడ్డి, మామిడి రాజులతో పాటు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసం హెల్ప్‌డెస్క్ పరిశీలన

- దరఖాస్తులపై ఆరా తీసిన డీపీవో



రికార్డులను పరిశీలిస్తున్న డీపీవో

తంగళ్లపల్లి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసం హెల్ప్‌డెస్క్‌ను జిల్లా పంచాయతీ రాజ్ శాఖ అధికారి షరీఫోద్దీన్ పరిశీలించారు. బుధవారం తంగళ్లపల్లి మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన రాజీవ్ యువ వికాస్ హెల్ప్‌డెస్క్‌ను పరిశీలించి దరఖాస్తులపై ఆరా తీశారు. ఇప్పటివరకు సుమారు 600 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. దరఖాస్తుదారులు ఇబ్బందిపడకుండా సహాయసహకారాలు అందించాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే రికార్డులను తనిఖీ చేశారు.



కదలిన యువతరం..

రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తులు

మండలం	ఎస్సీ	ఎస్టీ	బీసీ	ఈబీసీ	మైనార్టీ	క్రిస్టియన్	మొత్తం
బోయినపల్లి	118	02	284	02	04	00	410
చందుర్తి	108	08	307	15	05	00	443
ఇల్లంతకుంట	143	04	342	08	06	00	503
గంభీరావుపేట	211	96	502	09	75	00	893
కోనరావుపేట	262	49	417	09	09	01	747
ముస్తాబాద్	556	105	1170	68	60	00	1959
రుద్రంగి	12	10	49	00	01	00	72
సిరిసిల్ల మున్సిపల్	88	13	1120	13	77	01	1312
తంగళ్లపల్లి	149	05	480	10	06	00	650
వీర్నపల్లి	26	60	76	04	01	00	167
వేములవాడ రూరల్	115	07	231	03	10	00	366
వేములవాడ అర్బన్	40	05	69	01	05	00	120
వేములవాడ మున్సిపల్	143	54	414	19	39	00	666
ఎల్లారెడ్డిపేట	301	125	851	41	65	03	1386
మొత్తం	2272	543	6309	202	363	05	9694

- రాజీవ్ యువవికాసం పథకానికి దరఖాస్తుల వెల్లువ
- పేద, మధ్య తరగతి వర్గాలకు ఉపాధి కల్పన
- జిల్లాలో మొదలైన రాజకీయ పైరవీలు
- జిల్లాలో ఇప్పటివరకు 9,694 దరఖాస్తులు
- 14 వరకు చివరి అవకాశం

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

పేద, మధ్య తరగతి వర్గాలకు ఉపాధి కల్పన అందించే దిశగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువవికాస పథకానికి రాజన్నసిరిసిల్ల జిల్లాలో యువతరం కదిలింది. దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. ఈ పథకానికి నిరుద్యోగులతో పాటు పలురకాల వ్యాపారులు ఆసక్తి చూపుతున్నారు. నిరక్షరాస్యులు సైతం దరఖాస్తులు చేసుకుంటున్నారు. రాయితీకోసం ఏదో ఒక యూనిట్‌లో దరఖాస్తులు చేసుకుంటున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు ఈబీసీ లబ్ధిదారులు ఈనెల 14వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకునే విధంగా అవకాశం కల్పించింది. నిరుద్యోగులు ఉద్యోగాల కోసం పోటీ పరీక్షలకు సిద్ధమవుతూనే స్వయం ఉపాధియూనిట్ల ద్వారా ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి కూడా ప్రయత్నం చేస్తున్నారు. సబ్సిడీతో కూడిన ఆర్థికసహాయం ప్రభుత్వం అందించడానికి బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తున్నారు.

● జిల్లాలో 9వేలకు పైగా దరఖాస్తులు..

రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా ఇచ్చే సబ్సిడీ రుణాలకు నాలుగు కేటగిరీ లుగా అందించడానికి నిర్ణయించారు. ఇప్పటివరకు రాజన్న సిరిసిల్ల జిల్లాలో 9,694 దరఖాస్తులు వచ్చాయి. ఎస్సీ కార్పొరేషన్‌కు 2,272 దరఖాస్తులు, ఎస్టీ కార్పొరేషన్‌కు 543, బీసీ కార్పొరేషన్‌కు 6,309, ఈబీసీ కార్పొరేషన్‌కు 202, మైనార్టీ కార్పొరేషన్‌కు 363, క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్‌కు 5 దరఖాస్తులు వచ్చాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఏడాదికి రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షల లోపు ఆదాయం ఉన్న వారికి పథకం వర్తిస్తుంది. రేషన్ కార్డు, కుల ధ్రువీకరణ, ఆధార్, పాన్‌కార్డు, రవాణా రంగ పథకాలకు డ్రైవింగ్ లైసెన్స్, వ్యవసాయ పథకాలకు పట్టాదారు పాసు పుస్తకం, దివ్యాంగుల కోసం సదరం సర్టిఫికెట్, పాస్‌పోర్టు సైజు ఫొటో, ఇతర పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది.

రేషన్‌కార్డు లేనివారు ఆదాయధ్రువీకరణ పత్రంతో దరఖాస్తు సమర్పించుకోవచ్చు. జూలై 1 నాటికి 21 నుంచి 55 ఏళ్లు ఉన్నవారికి, వ్యవసాయ అనుబంధ రంగాల్లో 21 నుంచి 60 ఏండ్ల వరకు అర్హత కల్పించారు. ప్రభుత్వం మార్జిన్ మనీతో పాటు బ్యాంక్ నుంచి కూడా రుణ సదుపాయం కల్పిస్తారు. రూ.50 వేల వరకు పూర్తి సబ్సిడీ ఇవ్వనున్నారు. కేటగిరీల్లో ఆర్థిక సహాయం అందించనున్నారు. వంద శాతం రాయితీతో రూ.50వేల వరకు సమాయం అందించనున్నారు. యూనిట్ ధర 50 వేల నుంచి రూ లక్ష వరకు 90శాతం రాయితీ, 10శాతం బ్యాంక్ రుణం, యూనిట్ రూ లక్ష నుంచి రూ 2 లక్షల వరకు 80శాతం రాయితీ 20శాతం రుణం, యూనిట్ రూ.2 లక్షల నుంచి రూ 4 లక్షల వరకు 70శాతం రాయితీ, 30శాతం బ్యాంక్ రుణం అందించనున్నారు.

● వ్యవసాయ యూనిట్లకు ప్రాధాన్యత

రాజీవ్ యువవికాసం పథకంలో వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహించే దిశగా యూనిట్లకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఎడ్ల బండ్లు, ఆయిల్ ఇంజన్‌లు, పత్తి సేకరణ, వేరుశెనగ యంత్రాలు, వర్మీ కంపోస్ట్, ఆయిల్‌ఫాం సాగు, పశుపోషణ కింద గేదేలు, ఆవుల డెయిరీఫాంలు, కోడిగుడ్ల వ్యాపారం చేపల వ్యాపారం, మేకలు, గొర్రెల పెంపకం, పాల వ్యాపారం ఎయిర్ కూలర్లు స్టీల్ సామగ్రి, ఆటోమోబైల్, బేకరీ వంట వ్యాపారాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. దీంతో వ్యవసాయ కుటుంబాల్లోని నిరుద్యోగులు ఎక్కువ దరఖాస్తులు చేసుకుంటున్నారు.

● లబ్ధిదారుల ఎంపిక అధికారులకు ఇబ్బందే..

రాజీవ్ యువ వికాసం పథకం లబ్ధిదారులను జూన్ 2 తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం నాటికి ఎంపిక చేయాలని ప్రభుత్వం గడువు విధించింది. రాజీవ్ యువవికాసం.. మిగతా 6లో

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధించిన 'బండపల్లి'

- రాష్ట్రంలో 10వ స్థానంలో నిలిచిన గ్రామపంచాయతీ

చందుర్తి, ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి): సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో 2022-23నాటికి దేశంలోని గ్రామపంచాయతీలు సాధించిన పురోగతి ఆధారంగా కేంద్ర పంచాయతీరాజ్ శాఖ విడుదల చేసిన పంచాయతీ పురోగతి సూచికలో తెలంగాణలో రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలంలోని బండపల్లి గ్రామ పంచాయతీ 10వ స్థానంలో నిలిచింది. పేదరిక నిర్మూలన, పంచాయతీలలో జీవనోపాధుల పెంపు, ఆరోగ్యం, చిన్నారులకు అనుకూలమైన సౌకర్యాల కల్పన, తాగునీరు, పారిశుద్ధ్యం. పచ్చదనం, మౌలిక వసతుల్లో స్వావలంబన, సామాజిక భద్రత, సుపరిపాలన, మహిళలకు అనుకూలమైన విధానాలు అనే తొమ్మిది కొలమానాల ఆధారంగా పంచాయతీల పనితీరును మదింపు చేశారు. ఆ ప్రకారం ఉత్తమ పనితీరు కనపరచిన పంచాయతీలను ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం పంచాయత్ అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్ పేరుతో ఆన్లైన్ పోర్టల్ ఏర్పాటుచేసి దరఖాస్తుల ఆహ్వానించగా చందుర్తి మండలంలోని బండపల్లి గ్రామ పంచాయతీలు దరఖాస్తు చేసుకుంది. అందులో గ్రామపంచాయతీ నమోదు చేసిన డేటాను రాష్ట్ర ప్రభుత్వం ధ్రువీకరించింది. వాటిని పరిగణనలోకి తీసుకున్న కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ పంచాయతీలు సాధించిన పురోగతికి సంబంధించిన సూచికలను నిర్ధారించించడంతో బండపల్లి గ్రామపంచాయితీ రాష్ట్రంలోనే 10వ స్థానంలో నిలిచిందని ఇన్‌చార్జ్ ఎంపీడీవో ప్రదీప్‌కుమార్ తెలిపారు.

హోరాహోరీగా వేములవాడ బార్ అసోసియేషన్ ఎన్నికలు

- టై అయిన అధ్యక్ష స్థానం

వేములవాడ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికలు బుధవారం హోరాహోరీగా సాగాయి. అధ్యక్ష స్థానానికి పోటీపడిన గుడిసె సదానందం, గుండ రవికి సమానంగా 48 ఓట్లు చొప్పున రావడంతో అధ్యక్ష స్థానం టైం అయినట్లు ఎన్నికల అధికారి గోపికృష్ణ తెలిపారు. 99 మంది సభ్యులకు 96మంది ఓటు హక్కును వినియోగించుకున్నారని, ప్రధానకార్యదర్శిగా గడ్డం సత్యనారాయణరెడ్డి ఎన్నికైనట్లు ఆయన తెలిపారు. ఉపాధ్యక్షుడిగా కటకం జనార్ధన్, జాయింట్ సెక్రటరీగా సంపత్‌గౌడ్, కల్చరల్, క్రీడల కార్యదర్శిగా గుజ్జ మనోహర్, గ్రంథాలయ కార్యదర్శిగా పంపరి శంకర్, కోశాధికారిగా బొజ్జ మహేందర్, మహిళా ప్రతినిధిగా జక్కుల పద్మ, సీనియర్ ఈసీ మెంబర్లుగా అన్నపూర్ణ, కనపర్తి రాజశేఖర్, కనికరపు శ్రీనివాస్, జూనియర్ ఈసీ మెంబర్లుగా యామ తిరుపతి, బూర సరిత, మహేష్‌లు ఎన్నికయ్యారని వివరించారు. అధ్యక్ష స్థానం ఫలితంపై రాష్ట్ర బార్ కౌన్సిల్‌కు సమాచారం అందించి, కౌన్సిల్ ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

రైతులు నష్టపోకూడదనే కొనుగోలు కేంద్రం ఏర్పాటు..

- మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ
- ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన



పొద్దుతిరుగుడు విత్తనాల కొనుగోలు కేంద్రన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

ఇల్లంతకుంట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రైతులు దళారీల బారినపడి నష్టపోవద్దనే కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. పొద్దుతిరుగుడు పంటను సాగుచేసిన రైతులు ధాన్యాన్ని అమ్ముకోవడానికి పడుతున్న ఇబ్బందులను ఈనెల 3న ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన పొద్దుతిరుగుడు కొనేదెన్నడు అనే కథనానికి స్పందన లభించింది. మండలకేంద్రంలోని మార్కెట్ శాఖ కార్యాలయ ఆవరణలో బుధవారం కొనుగోలు కేంద్రం ప్రారంభమయ్యింది. కార్యక్రమంలో ఏఎమ్‌సీ చైర్‌పర్సన్ ఐరెడ్డి చైతన్యమహేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ప్రసాద్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ అయిలయ్య, ఏపీఎం వాణీశ్రీలతో పాటు ఏఎమ్‌సీ డైరెక్టర్లు, మహిళలు పాల్గొన్నారు.

మెరుగైన రవాణా సౌకర్యాల కల్పనకు కృషి

ఇల్లంతకుంట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : మెరుగైన రవాణా సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తుందని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. మండలకేంద్రంలో బుధవారం సీసీ రోడ్డు నిర్మాణానికి కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూతో కలిసి భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్గత రోడ్ల నిర్మాణాలకు అన్ని గ్రామాలలో పనులు ప్రారంభం అయినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం రెండింటిపై దృష్టి నిలిపిందన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు రమణారెడ్డి, అయిలయ్య, కిసాన్‌సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాశం రాజేందర్‌రెడ్డి, తహసీల్దార్ ఫారూఖ్, ఎంపీడీఓ శశికళ. నాయకులు ఆనందరెడ్డి, నాగయ్య, కేశవరెడ్డి, సత్యం, మామిడి రాజు, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాలు ప్రారంభం

మండలకేంద్రంలో కేపీఎస్ ఆర్మీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను ఎమ్మెల్యే సత్యనారాయణ ప్రారంభించారు. అనంతరం సిరికొండను సంక్షేమ పథకాల అమలు కోసం పైలెట్ గ్రామంగా చేపట్టగా లబ్ధిదారులతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. కార్యక్రమంలో స్పోర్ట్స్‌క్లబ్ అధ్యక్షుడు మామిడి రాజు, నాయకులు బాలరాజు, చిట్టి ప్రదీప్‌రెడ్డి, ఒగ్గు రమేష్, కాసుపాక సురేష్, రవీందర్‌రెడ్డి, అనీల్, దినేష్, రేగుల కార్తీక్, దయ్యాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలు..



మంగళహారతులు సమర్పిస్తున్న మహిళలు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లోని సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామి వారి రథోత్సవం రమనీయంగా జరిగింది. మహిళలు భారీ సంఖ్యలో హాజరై మంగళహారతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. హనుమాన్ దీక్షా పరుల భజనల నడుమ స్వామి వారి రథం ముందుకు కదిలింది. ఊరంతా రామ నామ స్మరణతో మార్మోగింది. ఆయా గ్రామాల తాజా, మాజీ ప్రజాప్రతినిధులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. రథానికి పూల అలంకరణ కోసం రూ 20 వేలను గ్రామంలోని నాయబ్ తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, స్థానికులు లింగాల వెంకటరాజు, పల్లె రాజు, చింతల రాకేశ్‌లు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ లక్ష్మారెడ్డి, మాజీ సర్పంచులు లక్ష్మీ, నర్సయ్య, నాయకులు నారాయణరెడ్డి, హన్మండ్లు, సుధాకర్‌రెడ్డి, పర్శరాములు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఉత్తమ సేవలందించాలి..

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ



మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ

సిరిసిల్ల కలెక్టరేట్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఏవోలు, ఏఈవోలు నిత్యం రైతులకు అందుబాటులో ఉంటూ ఉత్తమ సేవలు అందించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ ఆదేశించారు. ధాన్యం సేకరణ, తేమశాతం గుర్తింపు, టోకెన్ల పంపిణీ, క్రాప్‌బుకింగ్, మట్టి నమూనాల సేకరణ, విత్తనాల సేకరణ రైతు బీమా పీఎం కిసాన్ తదితర అంశాలపై జిల్లాలోని ఏవోలు, ఏఈవోలతో కలెక్టరేట్‌లో కలెక్టర్ బుధవారం సమీక్ష సమావేశం, శిక్షణ అందజేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడారు పంట కోతలు పూర్తి అయిన రైతులకు టోకెన్లు అందజేయాలని, దానికి అనుగుణంగా ధాన్యాన్ని తేమ శాతం గుర్తించి కొనుగోలు చేయాలని ఆదేశించారు. పక్కా ప్రణాళిక ప్రకారం పనులు చేయాలని స్పష్టం చేశారు. జిల్లాలోని వ్యవసాయ అధికారులు రైతులకు తమతమ పరిధిలోని రైతు వేదికలు, కార్యాలయాల్లో అందుబాటులో ఉండాలని, రైతులకు సాగులో వస్తున్న ఆధునిక పద్ధతులు, మెలకువలు ఉత్పత్తి పెంచే సలహాలు సూచనలు అందించాలని సూచించారు. మట్టి నమూనాల సేకరణ, విత్తనాల ఎంపిక తదితర అంశాలపై తమ పరిధిలోని గ్రామాలకు వెళ్లి అవగాహన కల్పించాలని ఆదేశించారు. రూ.2500 విలువైన ఎరువుల బస్తాలు ప్రభుత్వం సబ్సిడీపై 266 రూపాయలకు అందజేస్తుందని తెలిపారు. రైతులు కూడా ఒక ఎకరాకు రెండు బస్తాల యూరియా వినియోగిస్తే సరిపోతుందని తెలిపారు. ఎక్కువ మోతాదులో ఎరువులు వేస్తే పంట, అలాగే నేలకు కూడా ఇబ్బందులు వస్తాయని రానురాను నేల నిస్సారమవుతుందని వివరించారు. అధికారుల సూచనల మేరకు ఎరువులు పురుగు మందులు వాడాలని స్పష్టం చేశారు. రైతులు తమకు ఉన్న నీటి వనరుల అంచనాతో పంటలు సాగు చేసుకోవాలని తెలిపారు. ఒకే పంటలు ఎప్పుడూ వేయకుండా మార్పిడి చేయాలన్నారు. ప్రతి సంవత్సరం ఏప్రిల్, మేలో వడగళ్ల, అకాలవర్షాలతో రైతులు నష్టపోతున్నారని దీనిని నివా రించేందుకు రైతులు 10 నుంచి 15 రోజుల ముందే రబీ (యాసంగి) సాగు పనులు మొదలుపెట్టాలని తెలిపారు. జిల్లాలో రబీ (యాసంగి)లో మొత్తం లక్ష 81వేల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారని వెల్లడించారు. దీనిలో 99 శాతం వరి సాగు చేశారని తెలిపారు. 2 వేల ఎకరాల్లో మొక్కజొన్న, మూడు వేల ఎకరాలు మిర్చి కూరగాయలు సాగు చేస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, లీడ్ బ్యాంకు మేనేజర్ మల్లికార్జునరావు, జిల్లాలోని ఏవోలు, ఏఈవోలు తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా హనుమంతు వైభవ పూజ

- పూజలో బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ - దీక్షాపరులతో అన్నప్రసాదం స్వీకరణ



సిరిసిల్ల బీఆర్ఎస్ భవన్‌లో హనుమంతు వైభవపూజ



పూజలో పాల్గొన్న మాజీ మంత్రి కేటీఆర్

సిరిసిల్ల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : హనుమాన్ దీక్షాపరుల భజనలతో హనుమంతు వైభవ పూజ కన్నుల పండువగా జరిగింది. ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు పాల్గొన్నారు. బుధవారం సిరిసిల్లలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయం తెలంగాణ భవన్‌లో హనుమాన్ దీక్షాదారులతో హనుమంతు వైభవ పూజ నిర్వహించారు. చక్రవర్తి సంకీర్తనచార్యుల ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో వైభవ పూజ ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి కేటీఆర్ స్వయంగా పూజలో పాల్గొనడంతో పాటు దీక్షాదారులతో కలిసి అన్నప్రసాదం కార్యక్రమంలో పాల్గొన్నారు. వెంట బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట అగయ్య, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, మాజీ వైస్‌చైర్మన్ సిద్ధం వేణు, బీఆర్ఎస్ వేములవాడ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ జిందం కళచక్రపాణి, మాజీ వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు బొల్లి రామ్మోహన్, చేపూరి నాగరాజు, అక్కరాజు శ్రీనివాస్, అగ్గిరాములు, ఏనుగు మనోహర్‌రెడ్డి, శరత్‌రావు, రాఘవరెడ్డి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్లలో వైభవంగా వీర హనుమాన్ శోభాయాత్ర



సిరిసిల్లలో వీరహనుమాన్ శోభాయాత్ర

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): హనుమాన్ జయంతిని పురస్కరించుకోని సిరిసిల్లలో విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి చేపట్టిన వీరహనుమాన్ శోభాయాత్ర వైభవంగా జరిగింది. పట్టణంలోని అర్యవైశ్యభవనం నుంచి ప్రారంభమైన శోభాయాత్ర కొత్త బస్టాండ్‌ల మీదుగా జరిగిన శోభాయాత్రలో హనుమాన్ దీక్షపరులతో పాటు విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ సభ్యులు పాల్గొన్నారు. ఈ శోభాయాత్రలో సద్గురు స్వామి సమర్థ మహారాజ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు చేపూరి అశోక్, భజరంగ్‌దళ్ సభ్యులు బుర్ర లింగమూర్తి, గుంటుక పురుషోత్తం, బండారి సంతోష్, కోమిరె గౌతమ్, క్రాంతిలతో పాటు బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాగుల రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో ట్రాఫిక్ ఏసీపీ యాదగిరిస్వామి పర్యవేక్షణలో బుధవారం స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. 66వాహనాల యజమానులకు జరిమానా విధించారు. కరీంనగర్ వన్‌టౌన్ వద్ద నిర్వహించిన తనిఖీల్లో నిబంధనల ప్రకారం నంబర్లు ప్లేట్ లేని వాహనాలతోపాటు, ధ్రువీకరణ పత్రాలు లేకపోవడం, శబ్ధకాలుష్యం వంటి కారణాలపై వాహనాలను ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ రమేష్ మాట్లాడుతూ భద్రతదృష్ట్యా ప్రతీ వాహనానికి హైసెక్యూరిటీ నంబర్ ప్లేట్ అమర్చుకోవాలన్నారు. తనిఖీల్లో ట్రాఫిక్ఎస్సైలు ఉపేంద్రాచారి, ప్రమోద్‌రెడ్డి పాల్గొన్నారు.

తాటిచెట్టుపై నుంచి పడి గీతకార్మికుడికి గాయాలు

కమాన్‌పూర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని గోకుల్‌నగర్‌కు చెందిన గీతకార్మికుడు గర్రెపల్లి వెంకటేష్(49)బుధవారం నూతుల కుంట కరకట్టపై గల తాటిచెట్టుపై నుంచి పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. కల్లుకుండలను దించుతున్న సమయంలో కాలుజారి కిందపడ్డాడు. తోటి గీతకార్మికులు 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఏఎల్పీలో ప్రమాదంలో కార్మికుడికి గాయాలు

రామగిరి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఏపీఏ డివిజన్ పరిధిలోని ఏఎల్పీలో బుధవారం మొదటి షిఫ్ట్‌లో జరిగిన ప్రమాదంలో సర్ఫేస్(బ్లాక్‌స్మిత్) కార్మికుడు మద్ది బీరయ్య గాయపడ్డాడు. ఏఎల్‌పి ప్రాజెక్టులోని పనిస్థలాల్లో క్రానికల్ అబ్లాంగ్ పనులు నిర్వహిస్తుండగా జరిగిన ప్రమాదంలో బీరయ్య మోకాలుకు గాయాలయ్యాయి. కార్మికుడిని ఏరియా ఆసుపత్రికి తరలించారు.



గంభీరావుపేటలోని పురాతన రామాలయం

రామయ్య సన్నిధిలో

అఖండజ్యోతి

- 700 ఏళ్లుగా వెలుగుతున్న నంద దీపం
- రాతితో నిర్మించిన కల్యాణ మండపం
- గంభీరావుపేట రామాలయం ప్రత్యేకత
- ఆలయంలో కొనసాగుతున్న బ్రహోత్సవాలు

గంభీరావుపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) గంభీరావుపేట మండల కేంద్రంలోని పురాతన శ్రీ సీతారామాలయంలో వెలిగే అఖండ నంద దీపానికి ప్రత్యేకమైన విశిష్టత. దాదాపు 700 ఏళ్ళుగా ఆరకుండా నంద దీపం వెలుగుతూనే ఉంది. రామాలయాన్ని కాకతీయుల చివరి రాజైన ప్రతాప రుద్రుడు దాదాపు 1333లో నిర్మించినట్టు ఆలయంలోని గంటపై చెక్కిన తెలుగు అంకెల ఆధారంగా తెలు స్తోంది. ఆలయంలో మూల విగ్రహ ప్రతిష్ఠకు ముందు అఖండ నంద దీపాన్ని ఏర్పాటు చేయగా, నాటి నుంచి నేటివరకు వెలుగుతునే ఉంది.

ప్రారంభమైన బ్రహోత్సవాలు..

శ్రీసీతారామాలయంలో శ్రీరామనవమి నుంచి స్వామివారి బ్రహోత్సవాలు ప్రారంభమయ్యాయి. శ్రీసీతారాముల కల్యాణం మొదలుకొని తొమ్మిది రోజులు పాటు బ్రహోత్సవాలు వైభవంగా సాగుతాయి. ఏటా మాదిరిగానే ఈ సంవత్సరం కూడా స్వామి వారి బ్రహోత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల నేపథ్యంలో ఆలయాన్ని రంగులతో ముస్తాబు చేశారు. స్వామివారిని అశ్వ, గజ, హనుమ, పొన్న, గరుడ సేవలపై ఊరేగిస్తారు. చివరి రోజున స్వామి వారు రథంపై నుంచి భక్తులకు దర్శనమిస్తారు.

16 స్తంభాలతో కల్యాణ మండపం

శ్రీ సీతారామాలయంలో 16 స్తంభాలతో కూడిన కల్యాణ మండపం అత్యంత సుంద రంగా రాతితో నిర్మించారు. ఏటా భద్రాచలంలో జరిగే విధంగా అదే సమయంలో రామాలయంలో శ్రీసీతారాముల కల్యాణ మహోత్స వాన్ని నిర్వహిస్తారు. కోరిన వారికి కోర్కెలను తీరుస్తాడని శ్రీ రామచంద్ర మూర్తిపై ఇక్కడి ప్రజలకు ప్రగాఢ విశ్వాసం.



భక్తుల కొంగు బంగారం..

మల్లుగారి నర్సాగౌడ్, ఆలయ పునర్నిర్మాణ కమిటీ చైర్మన్

గంభీరావుపేట పురాతన రామాలయంలోని శ్రీరామచంద్రమూర్తి కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా విరజిల్లుతున్నారు. రామాలయానికి అనేక ప్రత్యేకతలు ఉన్నాయి. సంతానం లేని వారు భక్తిశ్రద్ధలతో కొలిస్తే తప్పకుండా స్వామి అనుగ్రహం ఉంటుంది. ప్రతీ ఏటా శ్రీరామ నవమి నుంచి స్వామివారి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతాయి.





రాతి కట్టడాలతో నిర్మించిన 16 స్తంభాల కల్యాణ మండపం

బావిలో పడి వ్యక్తి మృతి

వెల్గటూర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ మండలంలోని జగదేవ్‌పేట గ్రామంలో ధర్మపురి మండలం జైన గ్రామానికి చెందిన సంగెపు మహేష్ (40) అనే వ్యక్తి ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందాడు. ఎస్సై ఉమాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం ధర్మపురి మండలం జైన గ్రామానికి చెందిన మృతుడు మహేష్ ఉపాధి నిమిత్తం ముంబైలో కూలి పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. అతడు 10 సంవత్సరాలుగా ఫిట్స్ వ్యాధితో బాధపడుతున్నాడు. ఈనెల 7న తమ బంధువుల ఇంటిలో శుభకార్యం ఉండడంతో జగదేవ్‌పేట గ్రామానికి తన కుటుంబ సభ్యులతో కలిసి వచ్చాడు. బుధవారం ఉదయం బహిర్భూమికి గ్రామ శివారులోని బావి వద్దకు వెళ్లాడు. అదే సమయంలో అతడికి ఫిట్స్ రావడంతో ప్రమాదవశాత్తు బావిలో పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య సంగెపు మంగ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై తెలిపారు.

ద్విచక్ర వాహనం చోరీ

జగిత్యాల క్రైం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : జగిత్యాల జిల్లా కేంద్రంలోని వాణినగర్‌లో ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. వాణినగర్‌కు చెందిన ఆరుముల్ల గంగారాం తన ఇంటి ముందు ద్విచక్ర వాహనాన్ని పార్కింగ్ చేశాడు. దొంగలు వాహనాన్ని బుధవారం అపహరించుక వెళ్లారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రమాదవశాత్తు ట్రాక్టర్‌తోపాటు బావిలోపడి చిన్నారి మృతి



గడ్డం జశ్విత(ఫైల్)

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌రూరల్ మండలం బహదూర్‌ఖాన్‌పేట గ్రామంలో చిన్నారి ప్రమాదవశాత్తు ట్రాక్టర్‌తోపాటు బావిలో పడి మృతిచెందింది. పోలీసులు, చిన్నారి తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నవివరాల ప్రకారం.. పెద్దపల్లిజిల్లా ధర్మారం మండలం బొమ్మారెడ్డిపల్లికి చెందిన గడ్డం అజేందర్‌రెడ్డి కూతురు జశ్విత(3)ను మూడు రోజుల కిందట బహదూర్‌ఖాన్‌పేటలోని పెద్దమ్మ, పెద్దనాన్నలు వారి ఇంటికి తీసుకెళ్లారు. గురువారం జశ్వితతోపాటు ఆమె పెద్దమ్మ, పెద్ద నాన్న, వారి కొడుకు అభిరాంరెడ్డి పొలం వద్దకు వెళ్లారు. చింతచెట్టు కొట్టేందుకు పనివాళ్లు రాగా అక్కడే ఉన్న ట్రాక్టర్‌ను అభిరాంరెడ్డి పక్కకు తీసుకెళ్లి వ్యవసాయబావివద్ద నిలిపాడు. ఆసమయంలో అభిరాంరెడ్డితో పాటు జశ్విత కూడా డ్రైవర్ సీటు పక్కనే కూర్చుంది. ట్రాక్టర్ ఇంజన్ ఆఫ్‌చేసిన అభిరాంరెడ్డి తాళంచెవి దానికే ఉంచి కిందకు దిగాడు. జశ్విత ఆ తాళంచెవితో ట్రాక్టర్‌ను ఆన్ చేసింది. దీంతో గేర్‌లో ఉన్న ట్రాక్టర్ పక్కనేఉన్న బావిలోకి దూసుకెళ్లింది. ట్రాక్టర్‌తోపాటు జశ్విత కూడా బావిలో పడింది. వెంటనే ఆమెను బయటకు తీసి కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే జశ్విత మరణించినట్లు వైద్యులు వెల్లడించారు. అభిరాంరెడ్డి నిర్లక్ష్యంగా తాళం చెవి ట్రాక్టర్‌కు వదిలివెళ్లి ప్రమాదానికి కారణమయ్యాడని చిన్నారి తండ్రి గడ్డం అజేందర్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తుచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కోడిపుంజును పట్టుకునేందుకు వెళ్లి.. వ్యవసాయ బావిలో పడి మృతి



రాజేశం (ఫైల్)

కమాన్‌పూర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లిజిల్లా కమాన్‌పూర్ మండలం సిద్దిపల్లె గ్రామానికిచెందిన నామని రాజేశం(70)అనేవ్యక్తి బుధవారం కోడి పుంజును పట్టుకునే క్రమంలో వ్యవసాయబావిలో పడి మృతిచెందాడు. వివరాలు ఇలాఉన్నాయి. వరిపంట కోతలు ప్రారం భించడానికి సంప్రదాయంలో భాగంగా పోతలింగన్న గుడివద్ద కోడి పుంజును కోస్తారు. కోడిపుంజును కొనుక్కొని సంచిలో పెట్టుకొని రాజేశం గుడి వద్దకు వెళ్ళాడు. సంచిలో నుంచి కోడిపుంజును బయటకు తీయగా ఒక్కసారిగా ఎగిరిపోయిన వ్యవసాయ బావిలో పడింది. దానిని పట్టుకునే క్రమంలో రాజేశం ప్రమాదవశాత్తు కాలుజారి వ్యవసాయ బావిలో పడ్డాడు. ఆ సమయంలో ఆప్రాంతంలో ఎవరూ లేకపోవడంతో రాజేశం బావిలోనే మృతిచెందాడు. పొలంవద్దకు వెళ్ళిన రాజేశం తిరిగిరాకపోవడంతో కుటుంబసభ్యులు పొలంవద్దకు వెళ్ళి పరిశీలించగా బావిలో పడినట్లు గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించగా వారు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి



అఫ్రోజ్ (ఫైల్)

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): గతనెల 30న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయపడగా, ఈనెల 7న ఒకరు మృతిచెందగా, మరొకరు బుధ వారం మృతిచెందారు. రెండు రోజుల వ్యవధిలో ఇద్దరు మరణించడంతో రెండు కుటుంబాల్లో విషాదాన్ని నెలకొంది. పోలీసులు, కుటుంబసభ్యుల కథనం మేరకు.. గ్రామంలోని మౌలాని-రఫీక్ దంపతుల చిన్న కొడుకు అఫ్రోజ్(20) ఐటీఐ పూర్తిచేసి ఇంటి వద్దే ఉంటున్నాడు. రంజాన్ పండుగకు అదే గ్రామంలోని తన చిన్నమ్మ కొడుకు ఆవేజ్‌తో కలిసి ద్విచక్రవాహనంపై సిరిసిల్లకు బయలుదేరారు. హరిదాస్‌నగర్ గ్రామ శివారులోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై సిరిసిల్ల నుంచి వస్తున్న ఆటో, అటు వైపునకు వెళుతున్న యువకుల బైక్‌లు ఢీకొన్నాయి. ఆవేజ్, అఫ్రోజ్‌లతో పాటు ఆటో ప్రయాణిస్తున్న మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను మొదట మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆవేజ్, అఫ్రోజ్‌ల పరిస్థితి విషమంగా మారడంతో హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. పరిస్థితి విషమించి ఈనెల 7న ఆవేజ్ చనిపోయాడు. మరో యువకుడు అఫ్రోజ్ బుధ వారం రాత్రి మృతిచెందాడు. మృతుడికి తల్లిదండ్రులు మౌలానీ, రఫీక్, సోదరులు అబ్బాస్, అబ్దుల్‌లు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

హార్వెస్టర్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- ఇరుక్కుపోయిన డ్రైవర్
- గంటపాటు శ్రమించి బయటికి తీసిన పోలీసులు

తిమ్మాపూర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): అర్ధరాత్రి హైదారాబాద్ నుంచి కరీంనగర్ వస్తున్న ఎలక్ట్రికల్ ఆర్టీసీ బస్సు ముందుగా వెళుతున్న హార్వె స్టర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సులోని ఒక ప్రయాణికురాలికి గాయాలు కాగా హార్వెస్టర్ డ్రైవర్ అందులోనే ఇరుక్కుపోయాడు. ఈ సంఘటన మండలంలోని ఇందిరానగర్ గ్రామంలో రాజీవ్‌రహదారిపై మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఎల్ఎండీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలానికి చెందిన శ్రీనుకి చెందిన హార్వెస్టర్ గంగాధరలో పనుల నిమిత్తం మంగళవారం రాత్రి బయలుదేరి వెళుతోంది. ఈ క్రమంలో హైదారాబాద్ నుంచి కరీంనగర్ వైపునకు వస్తున్న కరీంనగర్ డిపోకి చెందిన ఆర్టీసీ బస్సు ముందుగా వెళుతున్న హార్వెస్టర్‌ను ఢీకొంది. దీంతో హార్వెస్టర్ పల్టీకొట్టుకుంటూ రోడ్డు మధ్యలో ఉన్నడివైడర్ పైనుంచి హైదారాబాద్ వైపు రాజీవ్ రహదారిపైకి దూసుకొచ్చింది. ఈ ప్రమాదంలో హార్వెస్టర్ డ్రైవర్ పంజాబ్‌కు చెందిన కౌశల్ సింగ్ అందులోనే ఇరుక్కుపోగా అందులోనే ఉన్న మరో ముగ్గురు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఎల్ఎండీ పోలీసులు, బ్లూకోట్స్ సిబ్బంది గంట సేపు కష్టపడి హార్వెస్టర్ డ్రైవర్ కౌశల్‌సింగ్‌ను బయటకు తీశారు. కౌశల్‌సింగ్ కాలు విరగగా, బస్సులో ప్రయాణిస్తున్న మల్యాలకు చెందిన అంజలికి గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన సమయంలో ఆర్టీసీ బస్సులో 50మంది వరకు ఉన్నారు. బస్సు ముందు భాగం మొత్తం ధ్వంసం అయింది. క్షతగాత్రులను 108లో కరీంనగర్‌లోని అసుపత్రికి తరలించారు. ఎల్ఎండీ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



గాయపడిన హార్వెస్టర్ డ్రైవర్ కౌశల్ సింగ్

తండ్రిని హత్య చేసిన తనయుడికి జీవిత ఖైదు

జగిత్యాల క్రైం/వెల్గటూర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): తండ్రిని హత్య చేసిన కేసులో తనయుడికి జీవిత ఖైదు జైలు శిక్షతో పాటు రూ.6వేల జరిమానా విధిస్తూ జిల్లాప్రధాన న్యాయమూర్తి నీలిమ బుధవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం వెల్గటూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గొడిసెలపేట గ్రామానికి చెందిన రెబ్బస్ పోచయ్యకు గట్టయ్య, లచ్చయ్య అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. తన ఆస్తిని ఇద్దరు కుమారులకు సమానంగా పంచి ఇవ్వగా గట్టయ్య వాటాను లచ్చయ్య కొనుగోలు చేశాడు. అప్పటినుండి పోచయ్య తన భార్యతో కలిసి పెద్దకుమారుడు లచ్చయ్య ఇంటిలో నివాసం ఉంటున్నాడు. కొన్ని రోజులుగా కుమారుడు లచ్చయ్యకు, తండ్రిపోచయ్యకు మధ్య గొడవలు జరుగుతున్నాయి. తనఇంటి నుంచి వెళ్లిపోవాలంటూ 2022ఏప్రిల్ 1న మరోసారి ఇద్దరిమధ్య గొడవజరగగా కర్రతో తండ్రిని లచ్చయ్య విచక్షణారహితంగా చితకబాదాడు. తీవ్రగాయాలైన పోచయ్య చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య మల్లవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి వెల్గటూర్ పోలీసులు కేసు నమోదు చేయగా సీఐ కోటేశ్వర్, ఎస్సై నరేష్‌లు కేసును విచారణ చేపట్టి నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఎంఎస్ ఎస్సై శ్రీకాంత్, కోర్టు డ్యూటి అధికారులు కిరణ్ కుమార్, శ్రీధర్‌లు సరైన సాక్ష్యులను కోర్టులో ప్రవేశ పెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ మల్లికార్జున్ కేసు వాధించారు.

నేరం రుజువు కావడంతో ముద్దాయి లచ్చయ్యకు జీవిత ఖైదు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. నిందితుడికి శిక్ష పడడంలో కృషి చేసిన పోలీస్ అధికారులను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్నరైతులు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): భూగర్భ జలాలు అడుగంటి పోయి బోరు బావులు ఎండిపోతున్నాయి.. నీళ్ల లేక తల్లడిల్లుతున్నాం.. తమ గ్రామ శివారులోని మానేరు వాగు నుంచి ఇసుకను తీస్తే ఊరుకోబోమంటూ ఎల్లారెడ్డిపేట మండలం పదిర గ్రామంలోని రైతులు బుధవారం ఆందోళనకు దిగారు. ఇసుకను రవాణా చేసేందుకు వాగు వద్దకు చేరుకున్న ట్రాక్టర్లను అడ్డుకున్నారు. ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లతో వాగ్వాదానికి దిగారు. వేరే గ్రామాల వారు వాగు నుంచి తరలిస్తే తమ పంట పొలాలు ఎండిపోతాయని వాపోయారు. సమాచారం అందుకున్న తహసీల్ అధికారులు అక్కడకు చేరుకుని శాంతింపజేయడానికి యత్నించిన ఫలితం లేకుండాపోయింది. చేసేదేమీ లేక ట్రాక్టరు డ్రైవర్లు అక్కడ నుంచి వెనుదిరిగారు.

వాగులో పడి వృద్ధురాలి మృతి

ధర్మపురి/శంకరపట్నం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణ శివారులో గల ఒకవాగులో పడి శంకరపట్నం మండలం మెట్‌పల్లి గ్రామానికి చెందిన బాకారపు మల్లమ్మ(89) అనే వృద్ధురాలు మృతి చెందింది. మృతికి సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉందని ఎస్ఐ ఉదయ్‌కుమార్ తెలిపారు.

రిటైర్మెంట్ బెనిఫిట్స్, సమ్మె వేతనాలు ఇవ్వాలి

- యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరుణాకుమారి

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలోని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్‌కు రిటైర్మెంట్ బెనిఫిట్స్ సమ్మెకాలం వేతనాలు, వేసవిసెలవులు ఇవ్వాలని అంగన్‌వాడీ టీచర్స్‌అండ్‌హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కరుణాకుమారి అన్నారు. బుధవారం సిరిసిల్ల పట్టణం కార్మిక భవనంలో యూనియన్ జిల్లా స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కరుణాకుమారి మాట్లాడుతూ జిల్లాలోని అంగన్ వాడీటీచర్స్, హెల్పర్స్‌కు రిటైర్మెంట్‌బెనిఫిట్స్, సమ్మెకాలం వేతనాలు, పీఆర్‌సీ 30శాతం ఇవ్వడం లేదన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీలను రెండవ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని కనీసవేతనాల జీవోను అమలుచేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం కనీస వేతనం రూ.18లు నెలకు ఇవ్వాలని పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, అంతిమ సంస్కారాలకు టీచర్లకు రూ. 20 వేలు, హెల్పర్‌కు రూ. 10వేలు సౌకర్యం కల్పించాలన్నారు ఉద్యోగ విరమణ చేసిన అంగన్వాడీ టీచర్ హెల్పర్‌కు కనీసం నెలకుపెన్షన్ రూ.3వేలుఇవ్వాలన్నారు. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలకు ఆన్‌లైన్‌లో విడివిడిగా ఆన్‌లైన్ చేయడం పని భారంగా మారిందని పని భారం తగ్గించాలని అన్నారు. ఆ సమావేశంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు సాయిశ్వరీ, గౌరవ అధ్యక్షుడు సమ్మయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు, అధ్యక్షుడు అజ్జ వేణు, అంగన్‌వాడీ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఎదురుగట్ల మమత తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరుణాకుమారి

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వెల్గటూర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కొద్ది రోజులక్రితం ఆత్మహత్యహత్నాయత్నం చేసిన వెల్గటూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎండపల్లిమండలం గొడిశెలపేట గ్రామానికిచెందిన అల్లె లచ్చయ్య (58) అనేవ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సైఉమాసాగర్ కథనం ప్రకారం.. లచ్చయ్య కూలిపనిచేసు కుంటూ జీవిస్తున్నాడు. అతడు 15సంవత్సరాలుగా అనారోగ్యంతో బాధప డుతున్నాడు. ఈక్రమంలో జీవితంపై విరక్తిచెంది ఈనెల7న గడ్డిమందు సేవించి ఆత్మహత్యాయత్నం చేశాడు. జగిత్యాలలో చికిత్స పొందుతూ పరిస్థితివిషమించి మంగళవారం మృతిచెందాడు. మృతుని భార్య అల్లెవిజయ ఇచ్చిన ఫిర్యాదుమేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

పురుగుల మందు తాగి వృద్ధుడు ఆత్మహత్య

సైదాపూర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయికల్ గ్రామానికి చెందిన చెరాల లింగయ్య(78) అనే వృద్ధుడు పరుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపినవివరాల ప్రకారం.. బుధవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో లింగయ్య పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. స్థానికులుచూసి అతని కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. వెంటనే కుటుంబ సభ్యులు, గ్రామస్థులు లింగయ్యను 108లో హుజూరాబాద్ ప్రభుత్వఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు.

తనతండ్రి అనారోగ్యానికి గురి కావడం, ఒంటరితనం భరించలేక పురుగుల మందుతాగి ఆత్యహత్య చేసుకొని ఉంటాడని మృతుడి కొడుకు చెరాల మొగిళి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

కుటుంబ కలహాలతో వివాహిత బలవన్మరణం

కోరుట్ల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలోని అయిలాపూర్ గుట్ట ప్రాంతానికి చెందిన రంజిత (22) అనే వివాహిత ఆత్మహత్యకు కుటుంబ కలహాలు, భర్త వేధింపులే కారణమనే తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం రంజిత ఇంట్లో ఎవరూ లేని సమయంలో రెండు రోజుల క్రితం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. బుధవారం రంజిత తండ్రి సాయిలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. రంజిత గత సంవత్సరం అక్టోబర్‌లో పవన్ అనే వ్యక్తిని ప్రేమ వివాహం చేసుకుంది. రంజిత, పవన్ దంపతులు అయ్యప్ప గుట్ట ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. పవన్ మద్యం సేవించి ఇంటికి వచ్చి డబ్బుల విషయంలో తన కూతురుతో గొడడ పడడంతో పాటు అతడి కుటుంబ సభ్యులు వేధింపులకు గురి చేసే వారిని మృతురాలి తండ్రి ఫిర్యాదు చేశాడు. ఈమేరకు పవన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనుమతి లేకుండానే పనులు ప్రారంభిస్తారా?

- పనులను అడ్డుకున్న భూయజమానులు

వేములవాడ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : అనుమతి లేకుండానే తమ సొంత భూముల్లో ప్రభుత్వ పనులు ఎలా ప్రారంభిస్తారని యజమానులు అధికారులు ప్రశ్నించారు. వేములవాడపట్టణంలోని ఎగువ ప్రాంతం నుంచి డ్రైనేజీద్వారా వస్తున్న మురుగునీరు గుడిచెరువులో కలవకుండా మళ్లించేందుకు దాదాపు మూడు కోట్ల రూపాయల అంచనా వ్యయంతో పనులు ప్రారంభించడానికి అధికారులు ప్రణాళిక రూపొందించారు. ఈ మేరకు బుధవారం పనులు ప్రారంభించగా తమకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా, తమ అనుమతి లేకుండానే పనులు ఎలా ప్రారంభిస్తారు అంటూ సంబంధిత భూయజమానులు అడ్డుకున్నారు. అధికారికంగా సమాచారం ఇచ్చి, తగిన పరిహారం ఇచ్చిన తర్వాతనే పనులు చేపట్టాలని పట్టుబట్టారు. ఈసందర్భంగా మున్సిపల్ కమిషనర్ అన్వేష్ మాట్లాడుతూ ఎఫ్‌టీఎల్ భూములలోనే పనులు చేస్తున్నామని, పనులు ఆపబోమని స్పష్టం చేశారు. భూ యజమానులు లాలనర్సింగం, ఫసియుద్దీన్, రామారావు, ఈర్లపల్లి రాజు, శ్రీనివాస్ తదితరులు ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్‌తో కొద్దిసేపు వాగ్వాదానికి దిగారు.



అధికారులను ప్రశ్నిస్తున్న భూ యజమానులు

బేకరీకి రూ.20 వేల జరిమానా

కోల్‌సిటీ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థ ప్రజారోగ్యవిభాగం సిబ్బంది బుధవారం గోదావరిఖని లక్ష్మీనగర్‌లోని సిరికేక్స్ అండ్ మోర్‌లో తనిఖీలు జరిపింది. ఈ తనిఖీల్లో కేకుల తయారీలో వినియోగించే రసాయనాలు కాలం చెల్లినవిగా గుర్తించారు. వీటితో పాటు మరికొన్ని కాలం చెల్లిన పదార్థాలను సీజ్ చేశారు. షాపు నిర్వాహకులకు రూ.20వేల జరిమానా విధించారు. తనిఖీల్లో హెల్త్ అసిస్టెంట్ కిరణ్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ మధుకర్, ఎంఐఎస్ ఆపరేటర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.



బేకరీ నిర్వాహకుడికి జరిమానా విధిస్తున్న కార్పొరేషన్ అధికారులు

డిపో మేనేజర్లతో రీజినల్ మేనేజర్ సమీక్ష

భగత్‌నగర్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రీజియన్ పరిధిలోని 11 డిపో మేనేజర్లతో రీజినల్ మేనేజర్ బి.రాజు బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. డిపోల్లో ఆపరేషన్స్, మెకానికల్ విభాగాల పనితీరు, డిపోల ఆర్థిక పరిస్థితిపై సమీక్షించారు. వేసవిలో బస్ స్టేషన్లలో ప్రయాణికుల సౌకర్యార్థం తాగు నీరు అందుబాటులో ఉంచాలన్నారు. మహాలక్ష్మి పథకం రద్దీ దృష్ట్యా ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్లు వెంకటేశ్వర్‌రావు, భూపతిరెడ్డి పాల్గొన్నారు.

పని చేసిన సర్పంచులపై పాలకుల వివక్ష

భగత్‌నగర్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): కష్టపడి పని చేసిన సర్పంచులపై పాలకులు వివక్ష చూపిస్తున్నారని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సుస్థిర అభివృద్ధి, గ్రామ పంచాయతీల పురోగతిలో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ఆరు గ్రామాలు ర్యాంకులు సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణలో 25 గ్రామ పంచాయతీలు ర్యాంకులు సాధిస్తే వాటిలో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోనే తిమ్మాపూర్ (కరీంనగర్)బండపల్లి (చందుర్తి మండలం), గంభీరపల్లి (జమ్మికుంట), బల్వంతాపూర్ (మల్యాల), రుద్రంగి, ఎల్లారెడ్డిపేట గ్రామ పంచాయతీలు మెరుగైన ర్యాంకులు సాధించినట్లు పేర్కొన్నారు. ఆయా పంచాయతీల్లో కీలకంగా పనిచేసిన నాటి సర్పంచులు, అధికారులకు అభినందనలు తెలిపారు. కష్టపడి పనిచేసిన మాజీ సర్పంచులపై కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలకులు తీవ్రమైన నిర్లక్ష్యాన్ని చూపడం సహించరాని విషయమని తెలిపారు. ప్రజల కోసం అప్పులు చేసి ఆస్తులు అమ్మి పంచాయతీలను అభివృద్ధి చేసినట్లు వెల్లడించారు.ఇకనైనా మాజీ సర్పంచులకు బిల్లులు చెల్లించాలన్నారు.

విద్యుత్ శాఖ సిబ్బందికి ఆన్‌లైన్ ఎల్‌సీపై శిక్షణ

గణేశ్‌నగర్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు మరింత నాణ్యమైన సేవలు అందించడంలో భాగంగా ఆన్‌లైన్ ఎల్సీ (లైన్‌క్లియర్) యాప్‌ను ప్రవేశపెడుతున్నామని కరీంనగర్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ మేక రమేష్ బాబు తెలిపారు. బుధవారం సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన శిక్షణ సమావేశంలో మాట్లాడారు. 11కెవి, ఎల్‌సి మొబైల్ యాప్ మీద ట్రైనింగ్‌లో భాగంగా టౌన్ వన్ సబ్ డివిజన్ టౌన్‌టు సబ్ డివిజన్ అలుగునూరు సబ్ డివిజన్ ఏఈలకు, సిబ్బందికి, సబ్‌స్టేషన్‌లో పనిచేసే ఆపరేటర్లకు ట్రైనింగ్ ఇచ్చినట్లు తెలిపారు. సమాచారలోపం ఇతర కారణాలతో ఎల్‌సీ తీసుకున్నపుడు చాలా తప్పులు జరుగుతున్నాయన్నారు. ఈ యాప్ ద్వారా మానవ తప్పిదాలను పూర్తిగా నివారించవచ్చని తెలిపారు.

కొండగట్టులో హనుమాన్ జయంత్యుత్సవాలకు ఏర్పాట్లు



- రేపటి నుంచి ప్రారంభం
- అంజన్నను దర్శించుకోనున్న లక్షలాది భక్తులు
- 12న చిన్న హన్‌మాన్ జయంతి

మల్యాల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానంలో ఈనెల 11 నుంచి 13 వరకు జరిగే చిన్నహనుమాన్ జయంత్యుత్సవాలకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి ఏటా కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానంలో నిర్వహించే ఈ జయంత్యుత్సవాలకు తెలంగాణ నుంచే కాకుండా మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి దాదాపుగా మూడు లక్షలకుపైగా దీక్షాపరులు, భక్తులు తరలివస్తుంటారు. జయంత్యుత్సవాలకు 41 రోజుల ముందు నుంచే 41, 21, 11 రోజుల దీక్షలను భక్తులు చేపట్టి జయంతి సందర్భంగా మాల విరమణ చేస్తారు.

కొనసాగుతున్న ఏర్పాట్లు

చిన్న జయంత్యుత్సవాల ఏర్పాట్ల కోసం ఎమ్మెల్యే, కలెక్టర్, ఎస్పీ, దేవస్థానం అధికారులతో పాటు వివిధ శాఖల అధికారులతో సమావేశమై ఆయా విభాగాల ద్వారా ఏర్పాట్లు చేయాలని సూచించారు. దీంతో కొండపైన చలువ పందిళ్లు, ప్రత్యేక క్యూలైన్‌లు, బారికేడ్లు ఏర్పాటు చేశారు. కోనేరు ప్రాంతం, ఆలయం వెనుకాల కూడా ఏర్పాటు చేయగా ఉత్సవాలకు సంబంధించిన స్వాగత తోరణాలు పెట్టారు. వాహనాలలో వాటర్ ట్యాంక్‌లు ఏర్పాటు చేసి వాటి రోడ్లపై తిప్పుతూ భక్తులకు ఎల్లవేళలా నీటిని అందుబాటులో ఉంచుతున్నట్లు అధికారులు తెలిపారు. వీటితో పాటు లక్షలాదిగా వచ్చే భక్తుల కోసం కొండపైన సీసీ కెమెరాలు, ఇతరత్రా ఏర్పాట్లును అధికారులు చేస్తున్నారు. అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరుగుతుండగా కలెక్టర్, ఎస్పీ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

ప్రతి ఏటా రెండు జయంత్యుత్సవాలు

కొండగట్టులో ప్రతి ఏటా రెండు జయంత్యుత్సవాలు జరుగుతాయి. ప్రతి ఏటా చైత్రపౌర్ణమి రోజున చిన్న హన్‌మాన్ జయంతి, తరువాత 41 రోజులకు బహుళశుద్ధ దశమి సందర్భంగా పెద్ద హనుమాన్ జయంతి నిర్వహించడం ఆనవాయితీ. ఒక్కో జయంతి మూడు రోజుల పాటు జరుగనుండగా లక్షలాదిగా హనుమాన్ దీక్షపరులు కొండకు వచ్చి మాలవిరమణ చేసి మొక్కులు తీర్చుకుంటారు. ఇందుకు గాను దేవస్థానంలో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు జరిగే చిన్న హనుమాన్ జయంతికి ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. శనివారం చిన్న హనుమాన్ జయంతి ఘనంగా జరగనుంది. ఇందుకుగాను రెండు రోజులుగా దీక్షాపరులు కొండగట్టుకు రావడంతో సందడి నెలకొంది.

ఇబ్బందులు లేకుండా చూడాలి

కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల, ఆంధ్రజ్యోతి: కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానంలో జరిగే జయంత్యుత్సవాల్లో భక్తులకు ఇబ్బందులు కలగకుండా పకడందీ ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఉత్సవాల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ మూడు రోజుల పాటు లైటింగ్, హోర్డింగ్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఈనెల 11వ తేదీ రాత్రి నుంచి 13వ తేదీ ఉదయం వరకు సుమారు రెండు లక్షలకు పైగా భక్తులు వచ్చే అవకాశాలున్నాయన్నారు. 14 కౌంటర్లు ఏర్పాటు చేసి సుమారు 5 లక్షల ప్రసాదాలను అందుబాటులో ఉంచాలన్నారు. ఆలయ ప్రాంగణంలో 64 సీసీ కెమెరాలు ఉండగా అదనంగా 50 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయా లన్నారు. 6 మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేసి సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. కొండపైకి వెళ్లేందుకు ఆర్టీసీ బస్సులను పెంచాలన్నారు. కల్యాణ కట్ట వద్ద ఎక్కువ మంది నాయీ బ్రాహ్మణులను ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లత, ఎస్పీ అశోక కుమార్, ఆర్డీఓ మధుసూదన్, డీఎస్పీ రఘుచందర్, కొండగట్టు ఆలయ ఈవో శ్రీనివాస్‌రావు, జిల్లా పంచాయతీ అధికారి మదన్ మోహన్, కలెక్టరేట్ ఏవో హకీం పాల్గొన్నారు.

భక్తుల పాదయాత్రలు ప్రారంభం

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి) 9: ఈ నెల 12వ తేదీ శనివారం చిన్న హనుమాన్ జయంతి సందర్భంగా పలు ప్రాంతాల నుంచి వివిధ పుణ్య క్షేత్రాలకు పాదయాత్రలు ప్రారంభమయ్యాయి. మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతానికి చెందిన పలువురు ఆంజనేయస్వామి దీక్షాపరులు బుధవారం కొండగట్టుకు పాదయాత్రగా వెళ్తూ నగరానికి చేరుకున్నారు. మొత్తం 250 కి.మీ ప్రయాణం ప్రారంభించినట్లు, వేములవాడ, కొండగట్టుకు వెళ్తున్నట్లు తెలిపారు. మే 22న పెద్ద హనుమాన్ జయంతి సందర్భంగా భక్తులు విజయవాడ, భద్రాద్రి, యాదాద్రి, ఇల్లందకుంట, వేములవాడ, కొండగట్టు, అగ్రహారం, ధర్మపురి, కాళేశ్వరం, తిరుమల జాపాలి తదితర ప్రాంతాలకు తరలి వెళ్లనున్నారు.



పాదయాత్రగా వెళుతున్న దీక్షాపరులు







మాట్లాడుతున్న జగిత్యాల కలెక్టర్ సత్య ప్రసాద్, కొండగట్టులో ప్రవేశద్వారం వద్ద స్వాగత తోరణాలు, లడ్డూలు తయారు చేస్తున్న మహిళలు

రేపు సిరిసిల్ల జిల్లాకు నలుగురు మంత్రుల రాక..

- అపెరల్ పార్కులో టెక్స్‌పోర్ట్ యూనిట్ ప్రారంభోత్సవం
- ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



టెక్స్‌పోర్టు యూనిట్‌ను పరిశీలిస్తున్న రాజన్న సిరిసిల్ల కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా

సిరిసిల్ల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి ఈనెల 11న నలుగురు మంత్రులు రానున్నారు. అపెరల్ పార్కులో నూతనంగా ఏర్పాటుచేసిన టెక్స్‌పోర్టు యూనిట్‌ను పౌరసరఫరాల శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, బీసీ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌లు ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా బుధవారం పరిశీలించారు. టెక్స్‌పోర్టు యూనిట్‌ను ప్రారంభించిన అనంతరం సభను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లపై రెవెన్యూ, పోలీస్ అధికారులతో కలిసి పరిశీలించి సూచనలు చేశారు. ఆయన వెంట సిరిసిల్ల ఆర్డీవో రాధాబాయి, డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, సిరిసిల్ల డీటీ విజయ్‌భాస్కర్‌రెడ్డిలు ఉన్నారు.

మానేరు వాగులో చెక్ డ్యాంను పునర్‌నిర్మించాలి..

పరిశీలించిన జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల మానేరు వాగులో దెబ్బతిన్న చెక్‌డ్యాంను పునర్నిర్మించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశించారు. బుధవారం సిరిసిల్ల పట్టణ శివారులో మానేరు వ్యాగులో దెబ్బతిన్న చెక్‌డ్యాంను ఈఎన్‌సీ శంకర్‌తో కలిసి పరిశీలించారు. పునర్నిర్మాణ పనులను చేపట్టాలని మానేరు బ్రిడ్జి నుంచి మూడు కిలోమీటర్ల పొడవు కరకట్ట పునర్ నిర్మించాలని అన్నారు. ఆయన వెంట ఈఈలు అమరేందర్ రెడ్డి, కిషోర్ తదితరులు ఉన్నారు.

పోలీసులు అంకిత భావంతో పనిచేయాలి

డీఐజీ సన్నీ



గదులను ప్రారంభిస్తున్న డీఐజీ సన్నీ

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పోలీస్ బెటాలియన్‌లో పనిచేస్తున్న పోలీసలు అంకిత భావంతో పనిచేయాలని డీఐజీ సన్నీ కోరారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని సర్ధాపూర్‌లోని 17వ పోలీస్ బెటాలియన్‌లో నిర్మించిన ఆయుధ కారాగారాన్ని బుధవారం వర్చువల్ పద్ధతి ద్వారా అడిషన్ డీజీపీ సంజయ్‌కుమార్‌జైన్ హైదరాబాద్ నుంచి ప్రారంభించారు. అలాగే బెటాలియన్‌ను సందర్శించిన డీఐజీ సన్నీ బెటాలియన్‌లో నూతనంగా నిర్మించిన దోబీ, బార్బర్ రూంలను ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో డీఐజీ సన్నీ మాట్లాడుతూ బెటాలియన్ అధికారులు, సిబ్బంది అంకిత భావంతో విధులను నిర్వహించాలని సూచించారు. బెటాలియన్ అభివృద్ధిలో సిబ్బంది ముఖ్య పాత్ర పోషించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ కమాండెంట్ సురేష్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రారంభమైన మహమ్మాయి దేవి బ్రహ్మోత్సవాలు

- ఈ నెల 12న జాతర
- క్యూలైన్లు, హోమశాల ఏర్పాటు



ముస్తాబైన ఆలయం

సుల్తానాబాద్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలం చిన్న కలువల గ్రామంలో వెలిసిన మహమ్మాయి దేవి బ్రహ్మోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఆదిపరాశక్తిగా పిలువుబడుతున్న మహమ్మాయి ఆలయ బ్రహ్మోత్సవాలు యేటా అంగరంగ వైభవంగా జరుగుతాయి. విశ్వకర్మలు, విశ్వబ్రాహ్మణ అనుబంధ కులస్తుల ఆరాధ్య దైవం. మహమ్మాయి దేవాలయం హుస్సేనిమియావాగు ఒడ్డున ఉంది. ఇక్కడ అమ్మ వారు స్వయంభూగా వెలిసినట్లు పురాణాలు చెబుతున్నాయి. ముంబాయిలో మొదటి శక్తిపీఠం ఉండగా రెండోది చిన్న కలువల మహమ్మాయి అమ్మవారి ఆలయంగా పరిగణి స్తున్నారు. శాతవాహనుల కాలం నాటి ఆలయం ఇది. రాష్ట్రంతోపాటు ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర నుంచి భక్తులు తరలి వస్తారు. ఉమా మహేశ్వర కల్యాణంతోపాటు అర్చనలు, అభిషేకాలు,కుంకుమ పూజలు నిత్య హోమాలు నిర్వహిస్తారు. వారం రోజులు సాగే పూజలలో నిత్యాన్న దానం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు, ఆలయ వ్యవస్థాపక అనువంశిక ధర్మకర్తలు తెలిపారు.



అమ్మవారు

భక్తులకు సౌకర్యాలు కల్పించాం

దేవరకొండ కృష్ణమాచార్యులు, బ్రహ్మోత్సవ నిర్వాహకులు

ఈ నెల 12 వరకు కొనసాగే మహమ్మాయి దేవి ఆలయ బ్రహ్మోత్సవాలకు పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా సౌకర్యాలు ఏర్పాటు చేశాం. చల్లని తాగునీరు, వారం రోజుల పాటు అన్న దానం ఏర్పాట్లు చేశాం. కరీంనగర్ సుల్తానాబాద్ వైపు నుంచి వచ్చే వారు తమ వాహనాలు చిన్నకలువల ఊరిలోపలి నుంచి దేవాలయం వరకు రావచ్చు. గోదావరిఖని, రామగుండం, మంథని, మంచిర్యాల వైపు నుంచి వచ్చే వారు పెద్దకలువల ప్రభుత్వ డిగ్రీ కళాశాల పక్క నుంచి కాలువ మీదుగా ఆలయానికి చేరుకోవచ్చు.



అన్నదానం కోసం నిర్మించిన షెడ్డు

రైతుల కోసం ఏఐ క్రాప్ కేర్ యాప్

- వ్యవసాయంలో నష్టం రాకుండా యాప్‌ను రూపొందించిన జ్యోతిష్మతి విద్యార్థులు
- అమెరికాలో ఇంటర్న్‌షిప్ కోసం ఆహ్వానం



పంటల పైన చేస్తున్న పరిశోధనలు

తిమ్మాపూర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రైతు కుటుంబంలో పుట్టి, రైతుల కష్టాలు చూసిన వారు.. ఎలాగైనా రైతులకు మేలు చేసే విధంగా తమ వంతు ఏదైనా చేసి చూపించాలనే దృఢ సంకల్పంలో ఓ యాప్‌ను రూపొందించారు. అంతే కాకుండా దానిపై పరిశోధనలు చేసేందుకు అమెరికాకు వెళ్లేందుకు అవకాశాన్ని దక్కించుకున్నారు. స్థానిక జ్యోతిష్మతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాలలో సీఎస్ఈ- 4వ సంవత్సరం చదువుతున్న అజిత్, సీఎస్ఎం 4వ సంవత్సరం చదువుతున్న అక్షిత్, సీఎస్ఈ 4వ సంవత్సరం చదువుతున్న రమేష్ కలిసి కలిసి ఒక టీంగా ఏర్పడ్డారు. రైతులు పండించే పంటలపై పరిశోధనలు నిర్వహించారు. ఇందుకోసం క్రాప్ కేర్ యాప్‌ను రూపొందించారు.

- **యాప్ ఉపయోగం:** భారతదేశ వ్యవసాయ పద్ధతుల గురించి, పంట వ్యాధులను గుర్తించేందుకు, స్థిరమైన వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించేందుకు విద్యార్థులు ప్రాజెక్టు ఆల్ క్రాప్ కేర్ అనే ఏఐ ఆధారిత పరికరాన్ని రూపొందించారు. ఈ ఏఐ ఆధారిత క్రాప్‌కేర్ యాప్‌లో ముందుగా రైతులు తమ పంటకు సంబంధించిన ఫొటోను యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఈ యాప్ పంటకు ఏమైనా వ్యాధి సోకిందా, దానిని ఏ విధంగా తగ్గించవచ్చు అనేది సూచిస్తుంది. పంట పండించక ముందే మార్కెట్‌లో ఎంత ధర ఉండే అవకాశం ఉంది, అసలు ఏఏ పంటలు పండిస్తే అధిక లాభాలు వచ్చే అవకాశం ఉందనేది ముందుగానే యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. సీజన్‌ను బట్టి ఏ పంటలు వేస్తే బాగుంటుందనేది కూడా యాప్ తెలియజేస్తుంది. రైతులు నష్టాల బారిన పడకుండా ముందస్తుగా ఒక అవగాహనకు వచ్చేందుకు ఈ యాప్ దోహదపడుతుంది.

ఇంటర్నేషనల్ ఇంటర్న్‌షిప్‌కు ఎంపిక కావడం సంతోషంగా ఉంది

జువ్వాడి సాగర్‌రావు, చైర్మన్, జ్యోతిష్మతి విద్యా సంస్థలు



తమ కళాశాలలో ఏర్పాటు చేసిన ఆధునాతన ల్యాబ్‌లను సద్వినియోగం చేసుకుని అమెరికాలో నిర్వహించే పరిశోధనలో పాల్గొనేందుకు తమ విద్యార్థులు ఎంపికకావడం సంతోషంగా ఉంది. ఇలాంటివి విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తుంది. విద్యార్థుల పరిశోధనలకు అన్ని విధాలుగా ప్రోత్సాహం అందిస్తున్నాం.



క్రాప్ కేర్ యాప్ రైతులకు ఎంతో మేలు

అజిత్, అక్షిత్, రమేష్, జ్యోతిష్మతి ఇంజనీరింగ్ కళాశాల

రైతుల కోసం ఏఐ ఆధారిత క్రాప్ కేర్ యాప్ రూపొందించడం చాలా సంతోషంగా ఉంది. ఇది పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే రైతులకు ఎంతో మేలు జరుగుంది. ఒక్క పంట ఫొటోతో మొత్తం పంటకు సంబంధించిన వివరాలు యాప్ తెలుస్తాయి. ఏ సీజన్‌లో ఏ పంటలు వేసుకోవాలి. ఏఏ పంటలు వేస్తే లాభాలు ఉంటాయి. మద్దతు ధరతో సహా అన్ని వివరాలు తెలుసుకోవచ్చు. రైతులకు ఈ యాప్ సహాయకారిగా ఉంటుంది.

అఖిల భారత హ్యాండ్‌బాల్ పోటీలకు ఉమ్మడి జిల్లా క్రీడాకారులు



పులి మాధవి, అనుపురం సాయికృష్ణ

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో ఈ నెల 7 ప్రారంభమైన అఖిల భారత పోలీస్ హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు ఉమ్మడి జిల్లాకు చెందిన పులి మాధవి, అనుపురం సాయికృష్ణ ఎంపికయ్యారు. రామడుగుకు చెందిన అనుపురం సయికృష్ణ మంచిర్యాల 13వ బెటాలియన్ నుంచి, కురుమపల్లికి చెందిన పులి మాధవి రామగుండం కమిషనరేట్ నుంచి ఎంపికైనట్లు ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బసరవేని లక్ష్మణ్ తెలిపారు. ఈ సందర్భంగా ఈ క్రీడాకారులను డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్దన్ రెడ్డి, ఉపాధ్యక్షులు కాసర్ల ఆనంద్ కుమార్, రమణారావు, పెటాటీఎస్ అధ్యక్ష, కార్యదర్శులు బాబు శ్రీనివాస్, ఆడెపు శ్రీనివాస్, పీడీలు అభినందించారు.

ఆరుబయట వంట.. తప్పని తంటా..

- ప్రభుత్వ పాఠశాలల్లో కానరాని వంట గదులు
- మధ్యాహ్న భోజనం నిర్వాహకుల ఇబ్బందులు



వంట గదిలోనే తాగు నీటి శుద్ధ పరికరం, నిలువ చేసిన టమాటాలు, గుడ్లు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో వంట గదులు లేక మధ్యాహ్న భోజనం నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని రాచర్లబొప్పాపూర్, రాచర్లగొల్లపల్లి, గుండారం, అక్కపల్లి, నారాయణపూర్ తదితర గ్రామాల్లోని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం చేసేందుకు సరైన వంట గదులు లేవు. దీంతో నిర్వాహకులు ఆరు బయట చేయాల్సి వస్తోంది. ఇరుకుగా ఉన్న వంట గదిలోనే తాగు నీటి శుద్ధ పరికరం ఏర్పాటు, అందులోనే కూరగాయలు, ఇతర సామగ్రి నిల్వ చేయడం వల్ల వంట తయారుకు స్థలం లేకుండాపోతోంది. దాంతో వంట నిర్వాహకులు ఆరుబయట చెట్లు, అసంపూర్తిగా ఉన్న తరగతి గదుల స్లాబ్‌ల కింద భోజనం తయారుచేస్తున్నారు. వంట చేసేందుకు ప్రభుత్వం గ్యాస్ సిలిండర్లను అందించకపోవడం వల్ల కట్టెల పొయ్యిపై వండాల్సి వస్తోంది. దాంతో తీవ్రమైన పొగ తరగతి గదుల్లోకి చేరుతుండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు నిర్వాహకులు మంట సెగను తట్టుకోలేకపోతున్నారు. వాన కాలంలో పరిస్థితి మరింతా దారుణంగా ఉంటుందని నిర్వాహకులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి పూర్తి స్థాయిలో వంట గదులను నిర్మించడంతో పాటు గ్యాస్ సిలిండర్లను అందించాలని వంట నిర్వాహకులు కోరుతున్నారు.



అసంపూర్తిగా ఉన్న తరగతి గది స్లాబ్ కింద వంట చేస్తున్న నిర్వాహకురాలు

విండో పరిధిలో వేల క్వింటాళ్ల ధాన్యం సేకరణకు అంచనా

- ఎస్. శ్రీవర్ధన్, సనుగుల ప్యాక్స్ సీఈవో



ఆంధ్రజ్యోతి: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం పరిధిలో ఎన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు?

సీఈవో: రుద్రంగి మండల కేంద్రంలో 2, రామరావుపల్లి, సనుగుల, దేవుని తండా, బండపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయగా, కిష్టంపేట లింగంపేట గ్రామాలను మహిళ సంఘాలకు కేటాయించారు.

ఆంధ్రజ్యోతి: ధాన్యం సేకరణ ఎంత అంచనా వేశారు?

సీఈవో: సనుగుల సింగిల్ విండో పరిధిలో వేల క్వింటాళ్ల ధాన్యం సేకరణకు అంచనా వేశాం.

ఆంధ్రజ్యోతి: కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి ఏర్పాట్లు చేశారు?

సీఈవో: రైతుల కోసం వేసవికాలం దృష్ట్యా చలువ పందిర్లు ఏర్పాటుతో పాటు మంచినీటి సౌకర్యం కల్పిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: కొనుగోలుకేంద్రాల్లో అదనంగా ఎంతమంది సిబ్బందిని నియమించారు?

సీఈవో: రుద్రంగిలో రెండు సెంటర్లకు పది మందిని కేటాయించగా, మిగతా కొనుగోలు కేంద్రాల్లో ముగ్గురు చొప్పున మొత్తం 20 మందిని అదనంగా సిబ్బందిని ధాన్యం సేకరణ కోసం నియమించాం.

- చందుర్తి (ఆంధ్రజ్యోతి)

పంటకు మద్దతు ధర చెల్లిస్తాం..

- కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : రైతుల పంటలకు మద్దతు ధరనిస్తూ కొనుగోలు చేస్తామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణ పరిధిలోని బాల్‌నగర్, రూరల్ మండలంలోని మల్లారం, చెక్కపల్లి గ్రామాలలో ప్యాక్స్ ఆధ్వర్యంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు పెద్దపీట వేస్తోందన్నారు. జిల్లాలో 248 సెంటర్లను ఏర్పాటుచేస్తామని, అందులో ఇప్పటికే 35 సెంటర్లను ప్రారంభించామన్నారు. రైతులు పండించిన పంట చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, జిల్లా గ్రంథాలయ చైర్మెన్ నాగుల సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, ప్యాక్స్ చైర్మెన్ ఏనుగు తిరుపతిరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ కనికరపు రాకేష్ జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి వసంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

● కోనరావుపేట : మండల కేంద్రంలో పాటు నిజామాబాద్‌లో సింగిల్‌విండో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. కోనరావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, వైస్ చైర్మన్ తాళ్లపల్లి ప్రభాకర్, డీసీవో రామకృష్ణ, ప్యాక్స్ చైర్మన్ బండ నర్సయ్య, కాంగ్రెస్ జిల్లా నాయకులు కేతిరెడ్డి జగన్మోహన్ రెడ్డి, లక్ష్మారెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాయిని ప్రభాకర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మల్లారెడ్డి, మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా, గొట్టె రుక్మిణి, రమేష్‌రెడ్డి, రంగారెడ్డి, కిషన్‌రెడ్డి, ఉప్పుల గంగయ్య, నీరటి సంజీవ్, సుంకరి రెడ్డి, డిసిఓ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

● సిరిసిల్ల రూరల్ : రైతులు ధ్యానం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధరలను పోందాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ కోరారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని విలీన గ్రామమైన పెద్దూర్‌లో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మ) అధ్వర్యంలో ఇందిరా మహిళాశక్తి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం సిరిసిల్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వెల్మూల స్వరూపతిరుపతి, తాజా మాజీ కౌన్సిలర్ చెన్నమనేని కీర్తికమలాకర్‌రావులతో కలిసి అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ ప్రారంభించారు. సిరిసిల్ల ఇంచార్జ్ ఆర్డీవో రాధాబాయి, జిల్లా వ్యసాయాధికారి అఫ్జల్ బేగం, సిరిసిల్ల మున్సిపల్ కమీషనర్ సమ్మయ్య, మెప్మ జిల్లా అడ్మినిస్ట్రేటీవ్ అధికారి మీర్జా ఫసహత్ అలీబేగ్, ఏఎంసీ డైరెక్టర్ దుబాల వెంకటేశం, జిల్లాఎస్సీ సెల్ కన్వీనర్ మంగ ప్రశాంత్, వార్డు ఉపాధ్యక్షుడు గుగ్గిళ్ల భరత్, బీసీసెల్ పట్టణ ప్రధాన కార్యదర్శి సలేంద్రి వేణుగోపాల్‌యాదవ్, నీరటి శ్యాం తదితరులు పాల్గొన్నారు.


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

● గంభీరావుపేట : గంభీరావుపేట మండలం లింగాపూర్, గజసింగవం, గోరంటాల, ముస్తాఫనగర్, గంభీరావుపేట, ముచ్చర్ల గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ప్రారంభించారు. మార్కెట్ కమిటీ చైర్మెన్ కొమిరిశెట్టి విజయ, వైస్ చైర్మెన్ అంజిరెడ్డి, తహసీల్దార్ మారుతిరెడ్డి, ఎంపీడీవో రాజేందర్, ఏపీఎం సుదర్శన్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు తిరుపతి, ఏఎంసీ డైరెక్టర్ భూక్య విఠల్, పార్టీ అధికార ప్రతినిధి మల్యాల రాజవీర్, సోషల్ మీడియా ఇంచార్జీ గౌరి శంకర్, నాయకులు బండ రమేష్ ఉన్నారు.

● ముస్తాబాద్: ముస్తాబాద్ మండల కేంద్రంతో పాటు తుర్కపల్లి, రామలక్ష్మణపల్లి, చీకోడ్, గోపాల్‌పల్లి గ్రామాల్లో బుధవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఏఎంసీ చైర్మెన్ తలారి రాణి, కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రెడ్డి, పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట : ఎల్లారెడ్డిపేట మండలం పదిర, దుమాల, అక్కపల్లి, బండలింగంపల్లి గ్రామాల్లో సెర్ప్-ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం స్థానిక నాయకులతో కలిసి తహసీల్దార్ సుజాత ప్రారంభించారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం మల్లేశం, నాయకులు రాంరెడ్డి, తిరుపతిరెడ్డి, లక్ష్మారెడ్డి, వెంకటేశ్, బాబు, శ్రీనివాస్, సంజీవరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

● తంగళ్లపల్లి : ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వెలుముల స్వరూప తిరుపతి రెడ్డి సూచించారు. బుధవారం తంగళ్ళపల్లి మండలం నేరెళ్ల, రాంచంద్రాపూర్, చిన్నలింగాపూర్, నర్సింహులపల్లి గ్రామాల్లో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రారంభించారు. కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ నర్సింగంగౌడ్, మాజీ ఎంపీటీసీ భైరినేని రాము, ప్యాక్స్ డైరెక్టర్ మంద నారాయణ, గుర్రం భారతి, అంజలి, బాలలక్ష్మీ, భారతి, హసీనా, గుర్రం రవీందర్‌రెడ్డి బోలవేని అనిల్, పిట్ల పరశురాములు, మాసినీ మాధవ్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు, ఏపీఎం, సీసీ, వివో అధ్యక్షురాళ్లు, మహిళా సంఘాలు, కొనుగోలు కమిటీ సభ్యులు, మహిళలు, రైతులు, హమాలీ సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● వీర్నపల్లి : మండలంలోని కంచర్ల, అడవిపదిర, మద్దిమల్ల, బంజేరు, మదిమల్ల తండా, బాబాయ్‌చెరువుతండా, ఎర్రగడ్డతండా గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మార్కెట్ కమిటీ చైర్మన్ లకావత్ రాములు నాయక్ ప్రారంభించారు. సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశం, ఏఎంసీ వైస్‌చైర్మన్ లెంకెల లక్ష్మణ్, ఏపీఎం నర్సయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూత శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాదవ్, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కదిలిన యువతరం

(3వ పేజీ తరువాయి)

పథకానికి నిరుద్యోగులతో పాటు ఇప్పటికే చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుంటున్న వారు సైతం దరఖాస్తులను చేసుకుంటున్నారు. పెద్ద సంఖ్యలో వస్తున్న దరఖాస్తులను పరిశీలించడం, ఎంపిక చేయడం అధికారులకు ఇబ్బందికరంగానే ఉంటుంది. కొందరు యూనిట్ మంజూరైతే సబ్సిడీ డబ్బులు మిగులుతాయనే ఆలోచనతో దరఖాస్తు చేసుకుంటున్న వారు ఉన్నారు.

● పైరవీల జోరు..

రాజీవ్ యువ వికాస పథకంలో దరఖాస్తులు చేసుకుంటున్న వారిని కొందరు యూనిట్ ఇప్పిస్తామని పైరవీలు ఇప్పుడే మొదలుపెట్టారు. అధికార పార్టీలో ఉన్న చోటామోటా నాయకులను దరఖాస్తు దారులు కలుస్తున్నారు. తమకు యూనిట్ వచ్చేలా చూడాలని కోరుతూ ఒప్పందాలు చేసుకుంటున్నారు. ఎంపిక సమయంలో పైరవీలతో అధికారులకు ఇబ్బంది కలిగే పరిస్థితులు కూడా ఉన్నాయి.

కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించాలి

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు ఎర్ర మహేశ్ కోరారు. మండల కేంద్రంలో పార్టీ ఆధ్వర్యంలో గావ్ చలో- బస్తీ చలో కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు.

ఈ సమావేశంలో నాయకులు లక్ష్మారెడ్డి, బుగ్గారెడ్డి, సాయిలు, రాజేశం, గణేశ్, జితేందర్, శ్రీనివాస్, దేవయ్య, కుమార్, వేణు, రవి, మధు, రంజిత్‌కుమార్, స్వామి, నరేశ్, పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పోషకాహారం అందించాలి

వేములవాడ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : గర్భిణులు, చిన్నారులకు పోషక విలువలతో కూడిన ఆహారం ఇవ్వాలని ఐసీడీఎస్ అధికారిని సౌందర్య అన్నారు. వేములవాడ పట్టణంలోని న్యూ అర్బన్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం నిర్వహించిన పోషక పక్షోత్సవంలో ఆమె పాల్గొన్నారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ కే. అంజమ్మ, న్యూ అర్బన్ కాలనీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విక్కుర్తి లక్ష్మీనారాయణ, అంగన్వాడి టీచర్ మంజుల తదితరులు పాల్గొన్నారు.

భగీరథ నీరు కలుషితం..

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని పలు వార్డులో మిషన్ భగీరథ నీరు కలుషితమైంది. బుధవారం సరఫరా అయిన భగీరథ నీరంతా పసుపు రంగులో వచ్చిందని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేశారు. తాగే నీరు ఇలా ఉంటే ఎలా అని వాపోతున్నారు. భగీరథనీరు తాగితే శరీరమంతా దద్దులు వస్తున్నాయని మరికొందరు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు దృష్టి సారించి భగీరథ నీరు కలుషితం కాకుండా చూడాలని కాలనీవాసులు కోరుతున్నారు.

లింగాపూర్‌లో క్షయ వ్యాధిపై అవగాహన

గంభీరావుపేట, ఎప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) గంభీరావుపేట మండలం సముద్ర లింగాపూర్ ఆరోగ్య ఉప కేంద్రంలో బుధవారం లింగన్నపేట ఆరోగ్యకేంద్రం వైద్య సిబ్బంది క్షయ వ్యాధిపై అవగాహన క్యాంపును నిర్వహించారు. ఈ సందర్భంగా టీబీ సూపర్‌వైజర్ మహిపాల్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైద్యులు వేణుగోపాలరెడ్డి, సీహెచ్‌వో రమేష్, నోడల్ సూపర్‌వైజర్ అమారావతి, ఏఎన్‌ఎంలు తదితరులు ఉన్నారు.

లింగన్నపేట బ్రిడ్జి సమస్యపై కేటీఆర్‌కు వినతి

గంభీరావుపేట, ఎప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట-లింగన్నపేట మానేరు వాగు బ్రిడ్జి సమస్య పరిష్కరించాలని మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్‌కు ఇచ్చిన వినతిపత్రంలో కోరారు. గంభీరావుపేటలో పెద్దమ్మ-పెద్దిరాజుల కళ్యాణ మహోత్సవానికి బుధవారం కేటీఆర్ విచ్చేసిన సందర్భంగా గ్రామ పురోహితులు ప్రార్థసారథిశర్మ బ్రిడ్జి నిర్మాణం తొందరగా జరిగే విధంగా చూడాలని కోరారు. సానుకూలంగా స్పందించిన కేటీఆర్ మా ప్రభుత్వంలో మంజూరైన నిధులతోనే బ్రిడ్జి నిర్మాణం జరిగే విధంగా చూస్తానని, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో మాట్లాడి బ్రిడ్జి సమస్యను పరిష్కరిస్తామని కేటీఆర్ హామీ ఇచ్చారు.

బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులకు సన్మానం

చందుర్తి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): సనుగుల గ్రామంలోని పాఠశాలలో ఉపాధ్యాయులుగా సేవలందించి బదిలీపై వెళ్లిన మర్రిపల్లి సౌజన్య, ఆరపల్లి సునీత, లకావత్ రవి, విశ్వనాథ చారిలకు బుధవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు ముఖేష్, మేకల పద్మ, న్యాతరి నాగమణి, చింతల హరిష్మా, నవ్య, మాదవి, రేగొండ సత్యనారాయణ, ఎడ్ల కిషన్, సురేష్, శ్రీలత, రజిత, రమేష్, ఉమ, సురేష్, పాల్గొన్నారు

డీటీఎఫ్ మండల కార్యవర్గం

కోనరావుపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం డిటిఎఫ్ కార్యవర్గ ఎన్నిక బుధవారం జరిగింది. అధ్యక్షుడిగా సుల్తాన్ పాపయ్య, ఉపాధ్యక్షులుగా ఈ.శ్రీనివాస్, కె.కవిత, ప్రధాన కార్యదర్శిగా మునుకుంట్ల శ్రీనివాస్, కార్యదర్శులుగా రాజేందర్, ఎస్. కమలాకర్, పద్మ, నర్సయ్య, జిల్లా కౌన్సిలర్లు డి.రాజేష్, కె.నరేందర్, ఈ. భూమేష్, ఎస్.రవీందర్ రెడ్డి, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా ఎస్. లక్ష్మీ నారాయణ, జి.భవాని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

చెక్కపల్లిలో ఎల్లమ్మ సిద్దోహం..

వేములవాడ రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : చెక్కపల్లిలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఎల్లమ్మ సిద్దోహం మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. బీజేపీ కౌన్సిల్ సభ్యుడు జక్కుల తిరుపతి బుధవారం మహోత్సవంలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. బీజేపీ మండల ఉపాధ్యక్షుడు మల్యాల రాజు గౌడ్, దానె తిరుపతి, బూత్ అధ్యక్షుడు సంతోష్‌రెడ్డి, లింగంపల్లి వెంకటేశ్, మల్లారం తిరుపతి, సందెసారి మల్లికార్జున్, నందగిరి రాహుల్ గౌడ్, జంగం వంశి, లింగంపల్లి కిషోర్, జంగం నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయ పద్ధతులను పాటించాలి

కోనరావుపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : సంప్రదాయ పద్ధతులను పాటించాలని హెచ్ఎం గీత భారతి అన్నారు. కోనరావుపేట మండలం మల్కాపేట ప్రభుత్వ పాఠశాలలో ఏక్ భారత్ శ్రేష్ఠ భారత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహేందర్‌రావు, శ్యాంకుమార్ పాల్గొన్నారు.

ట్రాక్టర్ కింద పడి డ్రైవర్ మృతి

కోనరావుపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం ధర్మారం గ్రామంలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కిందపడి బుధవారం మృతిచెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... ధర్మారం గ్రామానికి చెందిన మల్యాల దేవయ్య (49) అనే ట్రాక్టర్ డ్రైవర్ వరి కోత హార్వెస్టర్ మిషన్ దగ్గర వడ్లను తీసుకువెళ్లడానికి ఇంజన్ ఆన్‌లోనే ఉంచి కిందికి దిగాడు. ట్రాక్టర్ నిలిపిన చోట భూమి డౌన్‌గా ఉండడంతో ట్రాక్టర్ కదిలి వెళుతుండగా ట్రాక్టర్ ఎక్కి ఆపే ప్రయత్నం చేయగా ట్రాక్టర్ టైర్ కింద పడిపోయాడు. వెంటనే గమనించిన రైతులు చికిత్స నిమిత్తం కరీంనగర్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య దేవా, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

గ్రామాల అభివృద్ధి కేంద్ర ప్రభుత్వ ధ్యేయం

చందుర్తి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధి కేంద్ర ప్రభుత్వ ధ్యేయమని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ మార్త సత్తయ్య అన్నారు. మండలంలోని ఎనగల్‌లో సీసీ రోడ్డు నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేశారు. మండల అధ్యక్షుడు మొకిలే విజేందర్, జిల్లా కౌన్సిల్ మెంబర్ పొంచెట్టి రాకేష్, మండల ప్రధాన కార్యదర్శి పెరుక గంగరాజు, నాయకులు పకిడే మల్లేశం, పకిడే శ్రీకాంత్, కూసుంబ లింగరావు, మ్యాకల జలెందర్, బద్దం తిరుమల్ రెడ్డి, కూసుంబ కిష్టస్వామి, ఆసినిపర్తి సుధాకర్, గుంటి గంగాధర్, మెండే నరేష్, కూసుంబ రామారత్నం, జవ్వాజి రామస్వామి తదితరులు పాల్గన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి

- బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రేగుల మల్లికార్జున్


మాట్లాడుతున్న బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్

తంగళ్లపల్లి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రేగుల మల్లికార్జున్ పిలుపునిచ్చారు. బుధవారం తంగళ్ళపల్లి మండల కేంద్రలోని పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన మల్లికార్జున్ మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థ ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని పిలుపునిచ్చారు. బీజేపీ మండల అధ్యక్షుడు వెన్నమనేని శ్రీధర్‌రావు, ప్రధాన కార్యదర్శి ఇటికల రాజు, పోకల శ్రీనివాస్, సహాయ కార్యదర్శి రెడ్డిమల్ల ఆశీర్వాద్, ఉపాధ్యక్షులు బక్కశెట్టి రాజేందర్, మహిళా అధ్యక్షురాలు కోడం భవిత, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు నాగుల శ్రీనివాస్, బూత్ అధ్యక్షులు బోలగం భాస్కర్‌గౌడ్, రెడ్డిమల్ల సుకేందర్, సీనియర్ నాయకులు తుపాకుల సత్యనారాయణ, ఇటికల మహేందర్, నక్క అశోక్, కటకం మధుసుదన్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

● వేములవాడ రూరల్ : బీజేపీ ఆవిర్భావ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గుర్రంవానిపల్లిలో మండల స్థాయి కార్యకర్తల సమావేశాన్ని బుధవారం పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా బీజే వైఎం జిల్లా అధ్యక్షుడు రాగుల రాజిరెడ్డి హాజరై పార్టీ ఆవిర్భావ ఆవశ్యకత గూర్చి కార్యకర్తలకు వివరించారు. ప్రధాన కార్యదర్శులు చంద్రగిరి ప్రశాంత్, నర్సింగోజు శంకర్, ఉపాధ్యక్షులు జింక శ్రీనివాస్, తిప్పరవేని రాజు, ఎరుగొక్కుల రమేష్, కార్యదర్శులు కొలనూరి సంజీవ్‌రెడ్డి, బూర శేఖర్, అధికార ప్రతనిధి విశ్వనాధం శ్రీధర్, నాయకులు గడ్డి ప్రశాంత్, గోనె బాస్కర్, గంట మహేష్ తదితరులు పాల్గొన్నారు.

● చందుర్తి : మండల కేంద్రంలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా కార్యకర్తల సమావేశం బుధవారం జరిగింది. కార్యక్రమంలో బీజేపీ సిరిసిల్ల నియోజకవర్గ కన్వీనర్ కరెడ్ల మల్లా రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి పెరుక గంగరాజు, అసెంబ్లీ కన్వీ నర్ మార్త సత్తయ్య, జిల్లా ఉపాధ్యక్షులు సిరికొండ శ్రీనివాస్, నాయకులు పొంచెట్టి రాకేష్, చిలుముల హనుమయ్య చారి, నాయకులు పత్తిపాక శ్రీనివాస్, ఎల్లాల తిరుపతిరెడ్డి, మట్కం మల్లేశం, గోస్కుల కమలాకర్, చింతకుంట సాగర్, మోత్కుపల్లి రాజశేఖర్, పాటి సుధాకర్, చిర్రం తిరుపతి, గడిగొప్పుల జీవన్, అయోధ్య పరశురాములు, బొరుగాయ తిరుపతి, కూతురు మహేందర్, పెరుక రంజిత్, బద్దం తిరుమల్ రెడ్డి, పాల్గొన్నారు.

● ఇల్లంతకుంట : దేశ అభివృద్ధికి బీజేపీ నిరంతరం పాటుపడుతుందని బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర కార్యదర్శి కరివెద మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు బీజేపీ అంత్యోదయ స్ఫూర్తితో ఏర్పాటు అయ్యిందన్నారు. అసాధ్యాలను సుసాధ్యాలు చేస్తూ పార్టీ ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు భూమల్ల అనీల్‌కుమార్, నాయకులు సాయగౌడ్, దేశెట్టి శ్రీనివాస్, సంతోష్, మల్లేశం, ముత్తవ్వ, మామిడి హరీష్, శ్రావణ్, శ్రీకాంత్, మహేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రలు

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణంలోని 21,31,33 వార్డులో బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రలు నిర్వహించారు. మున్సిపల్ పరిధిలోని 21, 31, 33 వార్డులో కాంగ్రెస్ పార్టీ జెండాలను ఏఐసీసీ కో ఆర్డినేటర్ ఆవేజ్ ఆవిష్కరించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో ప్రతిజ్ఞ చేయించారు. రాష్ట్ర ప్రభుత్వ చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథాకాల కరపత్రాన్ని ఆవిష్కరించారు. కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, ప్రధాన కార్యదర్శి మ్యాన ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంగళ అశోక్, చేనేత సెల్ జిల్లా అధ్యక్షుడు గోనె ఎల్లప్ప, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, మహిళ జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, ప్రధాన కార్యదర్శి కోడం అరుణ, పీసీసీ మాజీ కార్యదర్శి గడ్డం నర్సయ్య, మాజీ కౌన్సిలర్ వేముల రవి, సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ మాజీ వైస్‌చైర్మన్ నీలి రవీందర్, మాజీ డైరెక్టర్ నేరెళ్ళ శ్రీకాంత్‌గౌడ్, నాయకులు వైద్య శివప్రసాద్, గుండ్లపెల్లి గౌతమ్, చల్ల హరికృష్ణ, అన్నల్‌దాస్ భాను, కల్లూరి చందన పాల్గొన్నారు.


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న అవేజ్, నాయకులు

● తంగళ్లపల్లి : తంగళ్ళపల్లి మండలం రామన్నపల్లె, అంకుసాపూర్ గ్రామాల్లో రాజ్యాంగ పరిరక్షణ యాత్ర నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జలగం ప్రవీణ్, నాయకులు మండాటి తిరుపతి యాదవ్, అంజన్నల తదితరులు పాల్గొన్నారు.

● గంభీరావుపేట : గంభీరావుపేట మండలం గోరంటాల, రాజేశ్వర్‌రావునగర్‌కాలనీ, గజసింగవరం గ్రామాల్లో బుధవారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్ ఆధ్వర్యంలో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షుడు కొమిరిశెట్టి తిరుపతి, బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు, ఏఎంసీ వైస్‌చైర్మన్ అంజిరెడ్డి, డైరెక్టర్ అజాం, ప్యాక్స్ డైరెక్టర్ అంజిరెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శి రామచంద్రారెడ్డి, సోషల్ మీడియా ఇన్‌చార్జీ గౌరి శంకర్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు సురేష్, అధికార ప్రతినిధి ప్రవీన్‌కుమార్, రాజశేఖర్ పాల్గొన్నారు.

● చందుర్తి : చందుర్తి మండలం మర్రిగడ్డ, మూడపల్లి, అనంతప ల్లి, నర్సింగాపూర్, గ్రామాల్లో బుధవారం జై బాబు, జై భీమ్,జై సం విధాన్, పాదయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం లో టీపీసీసీ సభ్యుడు సంగీతం శ్రీనివాస్, మండల అధ్యక్షులు చింతపంటి రామస్వామి, మాజీ జడ్పిటిసి సభ్యుడు నాగం కుమార్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బొజ్జ మల్లేశం, నాయకులు భీమరాజు కనకరాజు, గొట్టే ప్రభాకర్, సొంత పూరి బాలకృష్ణ, దూది శ్రీనివాస రెడ్డి, ఇందూరి మధు, నేతికుంట జలపతి, బాణాల రవీందర్‌రెడ్డి, చంటి ఏసుదాసు, శ్రీకాంత్, ముకుందరెడ్డి, ప్రసాద్, శ్రీనివాస్, వెంక టేశం, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

బోయనపల్లి : బోయినపల్లి మండలం మల్లాపూర్, మాన్వాడ, కొత్తపేట, గ్రామాల్లో బుధవారం ఏఐసీసీ, పీసీసీ పిలుపు మేరకు జై బాపు, జై భీమ్, జై సంవిధన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం మాటాడారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వన్నెల రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని ధర్నా


సిరిసిల్లలో ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు, కార్యకర్తలు

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్, డీజీల్, పెట్రోల్ ధరలను తగ్గించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు డిమాండ్ చేశారు. బుధవారం సిరిసిల్ల పట్టణం అంబేద్కర్ చౌరస్తాలో సీపీఐ ఆధ్వర్యంలో పెంచిన గ్యాస్, డీజీల్, పెట్రోల్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఎర్రజెండాలతో సీపీఐ నాయకులు, కార్యకర్తలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు మాట్లాడారు. అంతర్జాతీయ స్థాయిలో క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గినప్పటికి దేశంలో బీజేపీ ప్రభుత్వం పేద మధ్య తరగతి సామాన్య ప్రజలపై భారం మోపడానికి వంట గ్యాస్ ధరలు పెంచడం దుర్మార్గమని ఆరోపించారు. పెంచిన వంట గ్యాంస్, పెట్రోల్, డీజీల్ ధరలను వెంటనే తగ్గించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి పంతం రవి, కార్యవర్గ సభ్యులు మంద సుద ర్శన్, కడారిరాములు, అజ్జ వేణు, లక్ష్మన్, రామస్వామి, మంత్రి చంద్రయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూలీల హాజరు నమోదులో ఇబ్బందులు..


కూలీల ఫొటో తీస్తున్న ఉపాధి సిబ్బంది

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజన్నపేట గ్రామశివారులోని కుంట కాలువ పనులు కొనసాగుతున్నాయి. ప్రతి రోజు కాలువ వెంబడి ఉన్న చెట్లు, మట్టి తొలగించేందుకు సుమారు 200 మంది కూలీలు పనులు చేస్తున్నారు. సుమారు కిలోమీటరు దూరం వరకు పని చేసినా మొదట ప్రారంభించిన ప్రాంతానికే చేరుకుంటేనే హాజరు నమోదు చేస్తామని ఉపాధి సిబ్బంది పేర్కొనడంతో ఆ చోటకు చేరుకుంటున్నారు. కూలీ పనులు రెండు గంటల పాటు చేస్తే ఫొటో, హాజరు కోసం నాలుగు గంటల పాటు పడిగాపులు కాయాల్సి వస్తోందని కూలీలు ఆవేదన చెందుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు పనులు ముగిసిన చోటనే హాజరు, ఫొటోలు తీసుకుని తమ ఇబ్బందులను తీర్చాలని కూలీలు కోరుతున్నారు. ఈ విషయంపై ఈజీఎస్ ఏపీవో కొమురయ్యను వివరణ కోరగా కాలువ, రహదారి పనులు చేసే ప్రాంతాల్లో మొదట ఎక్కడ నుంచి ప్రారంభమవుతాయో అక్కడ నుంచే ఆన్‌లైన్‌లో కూలీల వివరాలు నమోదవుతున్నాయని వివరించారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని పేర్కొన్నారు.

సిరిసిల్లలో నేటి నుంచి మున్సిపల్ కార్మికుల సమ్మె

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల మున్సిపల్ కార్మికుల వేతనాల పెంపుతోపాటు వారి సమస్యలను జిల్లా అధికారులతో పాటు రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో గురువారం మున్సిపల్ కార్మికుల సమ్మె చేయనున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ తెలిపారు. మున్సిపల్ కార్మికుల వేతనాలు పెంపునకు అనేక పోరాటాలు చేసిన ఫలితంగా గత ప్రభుత్వం 2021 జూన్‌లో 11వ పీఆర్‌సీ కింద మున్సిపల్ కార్మికుల వేతనాలను రూ 12వేల నుంచి రూ 15వేల 600లకు పెంచిందన్నారు. కానీ పెరిగిన వేతనాలు ఇవ్వడం జరుగుతుందని 8నెలల పీఆర్సీ బకాయిలు రావాల్సి ఉంటే మధ్యలో చాలాసార్లు కార్మికులు అడిగితే 3నెలల పీఆర్సీలను ఇవ్వడం జరిగిందన్నారు. 250 మంది కార్మికులకు ఇంకా ఐదు నెలల పీఆర్సీ ఒక్కొక్కరికి రూ 18వేల చొప్పున మొత్తం రూ 45లక్షలు రావాల్సి ఉందని, దీని గురించి అధికారులను అడిగితే స్పందించడం లేదన్నారు. ఫిబ్రవరి, మార్చి నేలల వేతనాలు కూడా ఇంకా కార్మికులకు ఇవ్వలేదన్నారు. కార్మికులకు సంబంధించిన పీఎఫ్, ఈఎస్ఐ ఇతర సమస్యలు కూడా ఉన్నాయని అన్నారు. ప్రస్తుతం మున్సిపల్ పాలకవర్గం గడువు ముగిసిపోయవడంతో మున్సిపల్‌కు ప్రత్యేక అధికారిగా జిల్లా కలెక్టర్ సందీఫ్‌కుమార్ ఝా ఉన్నారని తెలిపారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి సమస్యలను పరిష్కరించాలని 15రోజుల క్రితం కలెక్టర్‌తో పాటు మున్సిపల్ కమిషనర్‌లకు వినతి పత్రాలను అందించినా ఎలాంటి స్పందన లేకుండాపోయిందన్నారు. దీంతో గురువారం నుంచి సమ్మె చేయాలని నిర్ణయించామని తెలిపారు.

పెద్దమ్మ తల్లిని దర్శించుకున్న కేటీఆర్


పెద్దమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న కేటీఆర్

గంభీరావుపేట, ఎప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేటలో పురాతన పెద్దమ్మ ఆలయంలో మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే కల్వకుంట్ల తారకరామారావు బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. పెద్దమ్మ, పెద్దిరాజుల కల్యాణ మహోత్సవం సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. ముదిరాజ్ సంఘం తరఫున కేటీఆర్‌ను సన్మానించారు. వెంట బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చిందం చక్రపాణి, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు పాపగారి వెంకటస్వామి, బీఆర్ఎస్ నాయకులు లింగన్నగారి దయాకర్‌రావు, పెద్దవేని వెంకటి, గంధ్యాడపు రాజు, వహీద్, లింగమ్‌యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బాలవ్వ, లతారెడ్డి, నిరంజనీ, మల్లేశం, శివయ్య, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు పిట్ల నర్సయ్య, ఈరవేని బాలయ్య, పోశయ్య, దేవేందర్, కర్నాల శ్రీనివాస్, దండవేని మీనయ్య, పిట్ల బాబు, యూత్ అధ్యక్షుడు సంజీవ్, నాయకులు సతీష్ తదితరులు ఉన్నారు.

బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న కేటీఆర్

కోనరావుపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం మల్కాపేట శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో మాజీ మంత్రి కేటీఆర్ గురువారం పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో చల్మెడ లక్ష్మీనరసింహారావుతో పాటు బీఆర్ఎస్ సీనియర్ నేత ఏనుగు మనోహర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ అరుణరాఘవరెడ్డి, మాజీ ఎంపీపీ చంద్రయ్యగౌడ్, సెస్‌వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి, మండల అధ్యక్షుడు మల్యాల దేవయ్య, పాక్స్ చైర్మన్లు రామ్మోహన్‌రావు, బండ నర్సయ్య, శశి, డైరెక్టర్లు హరిచరణ్‌రావు, ఆరే లత మహేందర్, రమణారెడ్డి, తాళ్లపల్లి సతీష్, గోపి రావు తదితరులు పాల్గొన్నారు.